అనుదినం...జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.praja.khammam@gmail.com
1 ఖమ్మం
మంగళవారం 12, డిసెంబర్ 2023

తుఫాన్ నష్టపరిహారం రైతులకు అందించాలి

కలెక్టర్‌కు తెలంగాణ రైతు సంఘం వినతి

నవతెలంగాణ-ఖమ్మం

డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన తుఫాన్ వలన నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ కలెక్టర్ గౌతంకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాల విస్తీర్ణంలో వరి పంట కోత దశలో కింద పడి వరి, మిర్చి, మొక్కజొన్న పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. పండ్ల తోటలు ముఖ్యంగా అరటి తోటలు పూర్తిగా పడిపోయాయి అన్నారు. కావున నష్టంపై సర్వే జరిపించి వరి, మొక్కజొన్న, మిర్చి ఎకరాకు ఇరవై ఐదు వేల రూపాయలు, అరటి తోటలకు ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, ఉపాధ్యక్షులు చింతనిప్పు చలపతిరావు, వాసిరెడ్డి ప్రసాద్, దుగ్గి కృష్ణ, సంక్రాంతి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



త్రివేణిలో మాక్ పార్లమెంట్

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రైమరీ విద్యార్థుల చేత మాక్ పార్లమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధికార పక్షం, విపక్షాల వలె రెండు వర్గాలుగా కూర్చుని జాతీయ సంపద సృష్టి, దేశంలో ఉన్న సమస్యలు, విద్య విజ్ఞానం వైద్యం మొదలైన రంగాలలో దేశం ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే అంశాలపై చర్చించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థిని విద్యార్థులలోని సజనాత్మకతను వెలికి తీస్తామని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షానికి వరి, మిరప, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. రూరల్ మండలంలో 630 ఎకరాల్లో వరి, 340 ఎకరాల్లో మిర్చి, 15 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు సర్వే ద్వారా తేల్చారని వీరికి నష్టపరిహారం వెంటనే అందజేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల బాధలను అర్థం చేసుకొని వెంటనే నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.



బీమా నగదు అందజేత

నవతెలంగాణ - ఎర్రుపాలెం

గత కొద్ది రోజుల క్రితం నుండి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు బీమా నగదును పెద్దగోపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి అక్కిరెడ్డి సోమవారం అందించారు. మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన సంఘ సభ్యులు కూరపాటి భాస్కరరావు మృతి చెందటంతో నామిని అయిన మృతుడి భార్యకు 50 వేల రూపాయల బీమా నగదును మండల కేంద్రమైన ఎర్రుపాలెం డిసిసిబి బ్యాంకు నందు అందచేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మగినం వీరభద్రం, అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భానుప్రియ, సూపర్వైజర్ మహేష్, సీఈవో వీరారెడ్డి, సొసైటీ సిబ్బంది ప్రసాద్, సాంబ, బ్యాంక్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ చల్లా రంగయ్య మృతి

నవతెలంగాణ-తల్లాడ



మాజీ ఎంపీపీ, కళాకారుడు చల్లారంగయ్య (65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు సందర్శించి నివాళ్లర్పించారు. రంగయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రంగయ్య అన్నారుగూడెం ఎంపీటీసీగా ఎన్నికై 1995 నుంచి 2000 వరకు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. కళాకారునిగా, ఎంపీపీగా ప్రజలకు సేవలందించి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. నివాళ్లర్పించిన వారిలో నాయకులు చల్లా నాగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, షేక్ మస్తాన్‌లు ఉన్నారు.



ఎంపీ వద్దిరాజు వితరణ

శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవా సమితికి రూ.లక్ష వితరణ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం ముస్తఫానగర్ లో అయ్యప్ప మాలధారుల కోసం ఐదేళ్లుగా శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా 41రోజుల పాటు అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తుండం తెలిసిందే. ఈ పుణ్య కార్యానికి ఎంపీ రవిచంద్ర సోమవారం హాజరై లక్ష రూపాయలు విరాళంగా అందించారు. ఎంపీ రవిచంద్ర అయ్యప్ప స్వాములతో కలిసి పూజలో పాల్గొన్నారు, వారికి స్వయంగా భోజనం వడ్డించారు. గత ఐదేళ్లుగా అయ్యప్ప స్వాములకు క్రమం తప్పకుండా అన్నప్రసాదం అందించడం గొప్ప విషయమని ఎంపీ వద్దిరాజు నిర్వాహకులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, అన్నదాన సేవా సమితి అధ్యక్షులు చిర్రా రవి స్వామి, పుట్ట మల్లికార్జున్, మాచర్ల నరేష్, నిడిగొండ శేఖర్, రవితేజ, చరణ్, గురుబ్రహ్మాం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో విగ్రహాల ప్రతిష్ట

నవతెలంగాణ- కామేపల్లి

పండితాపురం గ్రామంలోని స్మశాన వాటికలో శివుడు, నందీశ్వరుడు స్వామి విగ్రహాలను సోమవారం ప్రతిష్టించారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ము నాగేశ్వరరావు తల్లిదండ్రులు ముత్తయ్య -భారతమ్మ జ్ఞాపకార్థం రూ.లక్ష ఖర్చు చేసి శివుడు, నందీశ్వరడు స్వామి విగ్రహాలను కొనుగోలు చేసి ప్రతిష్టించినట్లు తెలిపారు. ముందుగా కెఎంటీ సెంటర్‌లో ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు, ఇంకా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఐతనబోయిన సత్యం, నాగేశ్వరరావు, విఠల్ రావు, శివ, వీరభద్రం, శీలం పుల్లయ్య, రవి, నరేష్, గొడుగు కొరివిలు, యండ్ర వెంకట్రావు, పోతనబోయిన రాంబాబు, చొప్పర సహదేవ్, ఉపేందర్, మామిళ్ల నర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం వైద్య శిబిరం

నవ తెలంగాణ- మధిర

మధిర మండల పరిధిలోని పీహెచ్‌సి దెందుకూరు వైద్యులు డా.పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో పారా మెడికల్ బృందంతో మధిర టౌన్‌లోని ఎస్‌సి కాలనీ హైస్కూల్ మరియు ఎస్‌టి గర్ల్స్ హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కాజా అరుణ, హరిజన వాడ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని విజయశ్రీ, ఉపాధ్యాయ సిబ్బంది మరియు పారామెడికల్ సిబ్బంది సుబ్బలక్ష్మి, లంకా కొండయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యదర్శుల పని విధానం పారదర్శకంగా ఉండాలి

- కష్టంతో కాదు, ఇష్టంతో పనిచేయండి
- సత్తుపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం
- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే సమీక్ష

నవతెలంగాణ-సత్తుపల్లి



గ్రామ పంచాయతీ కార్యదర్శుల పని విధానం పారదర్శకంగా ఉండాలని, ఏ పని చేసినా అందులో నిబద్ధత కనపడాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సోమవారం సత్తుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాగమయి దయానంద్ జీపీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేయాలన్నారు. కార్యదర్శులపై ప్రజల నుంచి అనేక కంప్లైంట్స్ ఉన్నాయని, వాటి జోలికి వెళ్లనన్నారు. ఇకనుంచి జరిగే ప్రతి పనిలోనూ నిబద్ధత ఉండాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో నెలకొని సమస్యలను పలువురు కార్యదర్శులు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించడానికి నా వంతు సహకారం ఉంటుందన్నారు. మీకున్న సమస్యలు, సిబ్బంది వివరాలు తదితర వాటిని నాకు అందిస్తే గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే విషయంలో కార్యదర్శులదే ముఖ్య భూమిక అన్నారు. ఇకనుంచి ప్రతి మూడు నెలలకోసారి కార్యదర్శులతో సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సర్పంచులు మందపాటి ముత్తారెడ్డి, పాకలపాటి శ్రీనివాసరావు, జక్కుల ప్రభాకర్, చెట్టుమాల రేణుకాఈశ్వర్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, నాయకులు కొత్తూరు ప్రభాకరరావు, గాదె చెన్నకేశవరావు, కిలారి వెంకటేశ్వరరావు, కమల్‌పాషా, గోలి శ్రీనివాసరెడ్డి, పామర్తి నాగేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను బెదిరింపులకు గురిచేశారు

ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులు బెదిరింపులకు గురయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నా నుంచి మీకు సముచితస్థానం ఉంటుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్మికులతో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి పెరిగిందన్నారు. పెత్తందారుల పెత్తనం వల్ల కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారన్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులు పడ్డ కష్టానికి ఈ సందర్భంగా రాగమయి దయానంద్ అభినందనలు తెలిపారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి, నాగుల్‌మీరా, కాంగ్రెస్ నాయకులు కమల్‌పాషా, దోమ ఆనంద్, మానుకోట ప్రసాద్, ఖలీల్ పాల్గొన్నారు.

ప్రజల ఆశలకు అనుగుణంగా పాలన ఉండాలి

- వ్యకాస జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం



ప్రజల ఆశలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం పాలన ఉండాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మీద వ్యతిరేకత తోటి కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఆశలతోటి ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, నూతన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశలకు అనుగుణంగా పరిపాలన కొనసాగించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక వ్యవసాయ కూలీల మీద, దళితుల మీద, దాడులు పెరుగుతున్నాయని, దాడులకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో పోరాటాలు నిర్వహించాలని ఆయన అన్నారు. బిజెపి ఉపాధికి ఏటా బడ్జెట్లో కేటాయింపులు తగ్గిస్తూ, కఠినమైన నిబంధన చేస్తూ, ఉపాధికి దూరం చేస్తుందని దీనికి వ్యతిరేకంగా పోరాడాలని ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు. బడ్జెట్లో 2.64 వేల కోట్లు కేటాయించాలని, సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని, రోజుకూలి 600 రూపాయలు ఇవ్వాలని, ఉపాధి కూలీలందరికీ కూలి బంద్, కూలి బీమా పథకం తేవాలని, ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతనంగా వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు కూలి బంద్, కూలి బీమా పథకం తేవాలని, కార్పొరేషన్, మున్సిపల్ పట్టణాల్లో ఉపాధి పని ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. వ్యవసాయ కూలీలకు సమగ్ర కూలి చట్టం తేవడం ద్వారా కూలి భద్రత కల్పించాలని ఆయన అన్నారు. వ్యవసాయ కార్మికులు, దళితులు, పేదలకు, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఇటీవల తుఫానుకి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, పొన్నెకంటి సంగయ్య జాజిరి శ్రీను, కేవీరెడ్డి, బంధం శ్రీను, తేలపోలు రాధాకృష్ణ, వడ్లమూడి నాగేశ్వరరావు, వి.జానకిరాములు, తేలపోలు రాధాకష్ణ, జి.రత్తమ్మ, మూడు గన్య, గామాస్ జోగయ్య, బి.యోహన్, గుమ్మా నరసింహారావు, బాదావత్ శ్రీను, గాడి ఇటికాల లెనిన్, ఎస్.వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



పేదలకు సేవచేసే భాగ్యం లభించింది

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సొంత గ్రామంలో అపూర్వ స్వాగతం

దేవాలయంలో పూజలు...తండ్రి స్మారకస్తూపం వద్ద నివాళి

నవతెలంగాణ- కల్లూరు



పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం మీ అందరి ఆశీస్సుల తోనే తనకు లభించిందని రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారి సొంత గ్రామమైన నారాయణ పురానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు మార్పులు కోరుకున్నారని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ఇందిరమ్మ రాజ్యం పరిపాలన కోసం శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తానని అన్నారు. పేదల సమస్యల పరిష్కారం కోసం తాను అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం ఎన్‌ఎస్‌పి క్రాస్ రోడ్‌లోని వీరభద్ర స్వామి దేవాలయంలో పొంగులేటి సోదరులు కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొంగులేటి తండ్రి రాఘవరెడ్డి స్మారక స్తూపం వద్ద పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయవాడ కనకదుర్గ దేవాలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెడమర్తి రవి, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కూనంనేని విజయోత్సవ ర్యాలీ

హాజరుకానున్న మిత్ర పక్షాల నాయకులు

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి విజయం సాధించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజయోత్సవ ర్యాలీని మంగళవారం ఖమ్మంలో నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ విగ్రహం నుంచి ర్యాలీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. రోటరీ నగర్, ఇల్లందు క్రాస్‌రోడ్, జెడ్పీ సెంటర్, పాత బస్టాండ్, ఎఫ్‌సీఐ బైపాస్ మీదుగా ఎంబి గార్డెన్స్‌కు ర్యాలీ చేరుకుంటుందని తెలిపారు. ఎంబి గార్డెన్స్‌లో అభినందన సభ జరుగుతుందన్నారు. ఈ సభలో సీపీఐ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, టీడీపీ, సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. అభినందన సభను, ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

డిజిటల్ బోధనకు వైఫై వితరణ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండల పరిధిలో జలగంనగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ బోధనకు గాను మ్యాక్లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు ఏడాదిపాటు వైఫై ఇంటర్నెట్‌ను సోమవారం వితరణగా అందజేశారు.పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ బోధనను ప్రారంభించారు. విద్యార్థులు ఇంటర్ నెట్ కనెక్షన్ ను సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసన్, కంపెనీ ప్రతినిధులు వెంకట్, లలిత, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ- మధిర

మధిర 132 కెవి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు నిర్వర్తిస్తున్నందు వల్ల మంగళవారం మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయబడునని సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎమ్.అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు.

'కమ్యూనిస్టులకు' గెలుపోటములు ముఖ్యంకాదు

- నిత్యం ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటాం
- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి

నవతెలంగాణ-సత్తుపల్లి



కమ్యూనిస్టులకు గెలుపోటములు ముఖ్యం కాదని అనునిత్యం ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక రావి వీరవెంకయ్య భవన్‌లో పట్టణ కమిటీ బాధ్యురాలు పాకలపాటి ఝాన్సీ అధ్యక్షతన జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో పాండురంగారావు మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం)కు ఓట్లేసిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. లేనియెడల ప్రజల పక్షాన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను కొత్త ప్రభుత్వం ఆదుకోవాలని పాండురంగారావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు, సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు, చెరుకు కుమారి, వలీ, వెంకట్రావు, చావా రమేశ్ పాల్గొన్నారు.

నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌కు రెజొనెన్స్ విద్యార్థి

నవతెలంగాణ- ఖమ్మం



నల్గొండ జిల్లాలో ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు జరిగిన స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ అండర్ -17, 58 కేజీల బాలుర విభాగంలో రెజొనెన్స్ కళాశాలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సయ్యద్ ఆదిల్ పాషా పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించి నేషనల్ లెవల్‌లో ఢిల్లీలో జరగబోయె ఈవెంట్‌కి అర్హత సాధించాడని కళాశాల డైరెక్టర్స్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ 17 బాలికల విభాగంలో రెజొనెన్స్ కళాశాలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సయ్యద్ సాలేహిన్ జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. చదువుతో పాటుగా అన్ని రంగాలలో శిక్షణ ఇవ్వడం తమ కళాశాల ప్రత్యేకత అని తెలిపారు. మా కళాశాల పేరును అత్యుత్తమ స్థానంలో నిలిపినందుకుగానూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇంటర్‌తో పాటే ఐఐటి, నీట్, ఎంసెట్ వంటి అన్ని జాతీయ, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు తగు శిక్షణనివ్వడం తమ కళాశాల ప్రత్యేకత అని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, శాంతి, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

నూతన ప్రభుత్వానికి అభినందనలు తెలిపిన ఆర్‌ఎంపిడబ్ల్యూప

నవతెలంగాణ-ఖమ్మం



తెలంగాణలో ఉన్న గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌ఎంపిడబ్ల్యూప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని కొండలరావు, బోయినపల్లి శ్రీనివాస్‌రావులు నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఖమ్మంలో ఓ ప్రయివేట్ ఫంక్షన్‌హాల్లో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామీణ వైద్యులను మోసగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని నూతనంగా ఏర్పాటు చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్‌ఎంపిడబ్ల్యూప సంఘం నుంచి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గ్రామీణ వైద్యులకు పెద్దపీట వేశారని, అదే తరహా ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు శిక్షణ తరగతులు నిర్వహించి 108, 102 లలో ఉద్యోగావకాశాలు కల్పించి ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గ్రామీణ వైద్యులంతా పూర్తిగా సహకరిస్తామని, అదే విధంగా అభివృద్ధిలో భాగస్వామ్యోతామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంపిడబ్ల్యూప రాష్ట్ర కమిటీ సభ్యులు కొంగర గోపి, జిల్లా గౌరవ అధ్యక్షులు అవుకు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ ఎస్వీ రామారావు, సీనియర్ నాయకులు బిక్షమయ్య, నారాయణ, ఖాసీం, మాధవరెడ్డి, రహీం, గౌతమ్, బాలు, కాంతారావు, రమేష్, షేక్ నాగుల్ మీరా, ముజీ తదితరులు పాల్గొన్నారు.



పాడే మోసిన పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ-ఖమ్మం

పువ్వాడ కృష్ణ సతీమణి అజయ్ కుమార్ పిన్ని పువ్వాడ పుష్పవతి మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. 41వ డివిజన్‌లోని పాత కలెక్టరేట్ వెనుక గల వారి నివాసంలో ఉంచిన ఆమె భౌతికకాయాన్ని ఆయన సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె పాడి మోసి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం బల్లేపల్లి వైకుంఠధామం నందు నిర్వహించిన ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, డిసిసిబి చైర్మన్ కురాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, పారా నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఎమ్మెల్యేని కలిసిన 15వ బెటాలియన్ కమాండెంట్ దంపతులు

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

సత్తుపల్లి మండలం బి.గంగారం 15వ బెటాలియన్ కమాండెంట్ పి.వెంకట్ రాములు స్థానిక ఎమ్మెల్యే డా మట్టా రాగమయి దయానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి, సత్తుపల్లికి విచ్చేసిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సహాయ దళాధిపతి యం శ్రీనివాసరావు, ఆర్ఐ యం సతీష్ కుమార్, ఆర్ఎస్ఐ బి.నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్టీయు నుండి ఐఎన్టీయుసీలో ఆటో డ్రైవర్ల చేరిక

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని సిటీ బస్టాండ్, చెన్నై షాపింగ్ మాల్, ఖానాపురం బస్టాండ్ అడ్డాలకు చెందిన సుమారు 150 మంది డ్రైవర్లు బీఆర్ఎస్ పార్టీ అనుబంధ బీఆర్టీయు ఆటో యూనియన్ నుండి ఐఎన్టీయుసీ ఆటో యూనియన్‌లో ఐఎన్టీయుసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరాల నరేష్ మోహన్ నాయుడు, సిహెచ్ విప్లవ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా కొత్తా సీతారాములు మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ, మంత్రులు ఆటో కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటారని, ఎవరి అపోహలు నమ్మవద్దని ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఆటో కార్మికులకు వర్తింపచేసేలా యూనియన్ పాటు పడుతుందని అన్నారు. సంఘం సిద్ధాంతాలకు కార్మికుల సంక్షేమానికి కట్టుబడివుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసీ ఆటో యూనియన్ నాయకులు పాష,ప్రభాకర్, వీరయ్య గౌడ్, గోపాల్, బాబా, అడ్డా ప్రెసిడెంట్స్ సురేష్, మూడ్ రవీందర్, వంశీ,రమేష్, వీరన్న,నాగేశ్వరరావు, ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.

ఓడినా గెలిచినా ప్రజల మధ్యే ఉంటా..

- బానోత్ మదన్‌లాల్

నవతెలంగాణ-కారేపల్లి

ఓడినా, గెలిచినా ప్రజల మధ్యనే ఉంటానని ప్రజలతోనే తిరుగుతానని వైరా మాజీ శాసనసభ్యులు బాణోత్ మదన్ లాల్ అన్నారు. సోమవారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మదన్ లాల్ మాట్లాడుతూ ఓడినంతమాత్రాన అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలని ప్రజా సమస్యలపై పోరాడాలని కార్యకర్తలను కోరారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందని, 2018 ఎన్నికలలో ఓడిపోయినా కన్నతండ్రిలా వైరా కు మరో అవకాశం కల్పించిన కేసీఆర్ మాటే శిరోధర్యంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ ఉన్నం వీరేందర్, మాజీ రైతు బంధు కన్వీనర్ హన్మకొండ రమేష్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సీలాల్, ఎంపిటిసి మూడు జ్యోతి. సర్పంచ్‌లు అజ్మీర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదరణ ఫౌండేషన్‌లో పల్లపోతు ప్రసాద్ రావు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మధిర

మధిర సేవా సమితి అధ్యక్షులు మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మధిర కోదండ రామాలయం చైర్మన్ పల్లపోతు ప్రసాద్ రావు జన్మదినం సందర్భంగా సోమవారం ఆదరణ ఫౌండేషన్‌లో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి, భూక్యా హనుమ, చుక్కా రాంబాబు, శీలం శ్రీనివాసరెడ్డి, వంగవీటి రాజశేఖర్ పాల్గొన్నారు.



శాంతి నిలయంలో దివ్యాంగులకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-బోనకల్

వైరా మండలం రెబ్బవరం గ్రామస్తులు అమరజీవి గుత్త వీరస్వామి జ్ఞాపకార్థం వారి సతీమణి గుత్తా అంజమ్మ బోనకల్ శాంతి నిలయంలోని దివ్యంగులకు దుప్పట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అనాథ దివ్యాంగ పిల్లలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా అంజమ్మ మాట్లాడుతూ దివ్యాంగులు దేవుని స్వరూపాలని, ప్రతి ఒక్కరూ దివ్యాంగ బాలలకు చేయూత ఇవ్వాలని కోరారు. జీవితం చాలా చిన్నదని, ఉన్నంతకాలం సమాజం పట్ల బాధ్యత, సేవా గుణం, మానవత్వంతో జీవించడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత, శాంతి నిలయం సిస్టర్ ఆల్ ఫీ, రెక్కల బేబీ కుమారి, సిలివేరు రామకృష్ణ, పల్లపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-ఎర్రుపాలెం



భీమవరం గ్రామంలో గల వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 9వ తరగతి విద్యార్థిని చూడబోయిన దుర్గ భవాని రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుభద్ర తెలిపారు. ఈనెల 13 నుండి 19 వరకు కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరు నందు జరుగు 33వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిత్యం వహించునునట్లు సుభద్ర తెలిపారు. దుర్గా భవానిని స్థానిక సర్పంచ్ శీలం జయలక్ష్మి, జడ్పిటిసి శీలం కవిత, ఎంపీటీసీ సభ్యులు సంక్రాంతి కృష్ణారావు, ఎస్ఎంసి చైర్మన్ కృష్ణారెడ్డి, సెగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎర్రమల పూర్ణచంద్రరెడ్డి, మాజీ ఎంపిటిసి ఉషా కి రణ్, వేమిరెడ్డి వెంకటరెడ్డి అభినందించారు. ఈ కార్య క్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పుల్లమ్మ, వెంకటే శ్వరరావు, సునీత, నరసింహారావు, సత్యనారాయణ, వీరస్వామి, సుజాత, రమాదేవి, తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ హబ్ గా మధిరను అభివృద్ధి చేద్దాం

- **అధికారుల సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి**

నవతెలంగాణ-మధిర



మధిర నియోజకవర్గాన్ని ఆర్గానిక్ హబ్‌గా అభివృద్ధి చేస్తానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. సోమవారం మధిర క్యాంపు కార్యాలయంలో డిఆర్డిఓ ఐకెపి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ప్రోత్సహిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలు కూడా సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల వినియోగానికి మక్కువ చూపిస్తున్న క్రమంలో మధిర నియోజకవర్గంలో సేంద్రియ పంటలను ఉత్పత్తి చేయడం వల్ల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని వివరించారు. వ్యవసాయ నిపుణులను పిలిపించి లాభసాటిగా ఉండే పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. పండించిన పంటలకు సైతం పంట పెట్టుబడికి మించి మంచి లాభాలు వచ్చే విధంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి తగిన ప్రాజెక్టును త్వరలోనే రూపొందిస్తామని వివరించారు.

మానవ వనరులను వాడకపోవడం నేరం

మానవ వనరులు అత్యంత బలమైనవి ఈ మానవ వనరులను వాడకపోవడం నేరమని అన్నారు. 10 సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం మానవ వనరులకు సరైన ప్రాధాన్య తీవకుండా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. మానవ వనరులను సంపదగా భావించి వారికి సరైన తర్ఫీదు ఇస్తే సంపదను సృష్టించవచ్చని వివరించారు. నియోజకవర్గంలోని మహిళలకు వివిధ రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తగిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని డీఆర్డిఓ అధికారులను ఆదేశించారు. కుట్టు శిక్షణ, సబ్బు తయారీ, అగర్బత్తిలు తయారీ, కొవ్వొత్తిల తయారీ, తదితర స్వయం ఉపాధి రంగాలపై అవగాహన సంఘాల మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్మాల్, మీడియం ఇండస్ట్రీ నిపుణులతో మహిళలకు శిక్షణ కార్యక్రమాలు ఇప్పించి వారు ఆర్థిక స్వావలంబన పొందేందుకు కృషి చేయాలన్నారు. బ్యాంకర్స్ తో మీటింగ్ ఏర్పాటు చేసి వారికి రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణకు 2013లో సెంటర్కు 20 చొప్పున ఇప్పించిన మిషన్లు ఏం చేశారని అధికారులను ప్రశ్నించారు. జిల్లా కేంద్రానికి వచ్చిన మిషన్లు తుప్పు పడుతున్న క్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు 2021లో పంపిణీ చేసినట్లు అధికారులు చెప్పిన సమాధానం పై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆ కుట్టు మిషన్లు తెప్పించిన లక్ష్యానికి భిన్నంగా వ్యవహరించడం సరికాదన్నారు.

అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలి

- **తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి**
- **సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్**

నవతెలంగాణ-కల్లూరు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏ పథకానికైనా రేషన్ కార్డు ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. కాబట్టి వెంటనే రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ కార్డులు మంజూరు చేయాలంటూ ఎంపీటీసీ కొండూరు కిరణ్ కుమార్ తదితరులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బీరవల్లి రఘు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ బీరవెల్లి రఘు, జడ్పిటిసి కట్టా అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుతూ కొత్త ప్రభుత్వానికి, సత్తుపల్లి శాసనసభ్యులు ఎన్నికైన మట్టా రాగమయికి మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతూ ప్రజల ఆశలకు అనుగుణంగా సంక్షేమ పథకాల అమలుచేసి అభివృద్ధిని కొనసాగించాలని ఆకాంక్షించి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ కొండూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఆరోగ్య శ్రీ, ఇందిరమ్మ ఇళ్లు లాంటి పథకాలు పేదలకు అందాలంటే రేషన్ కార్డులు తప్పనిసరి కావడంవల్ల లేని వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని అన్నారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన వారికి నష్ట పరిహారం అందేలా చూడాలన్నారు. ఆగి పోయిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ పనులు ఈ ప్రభుత్వంలో కొనసాగించేలా తీర్మానం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. ఎంపీటీసీలు కొన్ని గ్రామపంచాయతీ సంబంధించిన సర్పంచులు చేసిన అభివృద్ధికి కార్యక్రమాలు బిల్లులు పెండింగ్ పెట్టారని వాటిని కూడా వెంటనే బిల్లు చేయాలని పిఆర్ఏఈ వెంకటేశ్వరరావు కోరారు. జాబ్ కార్డులు లేనివారికి కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలని సూచించారు. సర్పంచులు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అదేవిధంగా సంక్షేమ పథకాల కోసం నిధులు మంజూరు చేయాలని ఆ విధంగా సభలో తీర్మానం చేయాలని కోరారు. శాఖల వారీగా సమీక్షలు నిర్వహించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పారు. ఈ సమావేశంలో ఎండిఓ బి రవికుమార్, తహసీల్దార్ సాంబశివుడు, మండల స్థాయి అధికారులు సర్పంచులు ఎంపీటీసీలు సమావేశానికి హాజరయ్యారు.

మిర్చి తోటలకు ఎకరానికి లక్ష నష్టపరిహారం ఇవ్వాలి

- **తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు**

నవతెలంగాణ-వైరాటౌన్

ఇటీవల వచ్చిన మీచాంగ్ తుఫాను వలన దెబ్బతిన్న మిర్చి తోటలకు ఎకరానికి లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం వైరా మండలం కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం వైరా మండల కమిటీ ఆధ్వర్యంలో గోల్లెనపాడు గ్రామంలో తుఫాను వలన దెబ్బతిన్న మిర్చి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కిలారు శ్రీనివాసరావు మాట్లాడుతూ భారీ వర్షాలు, ఈదురు గాలులు వలన మిర్చి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన బాధ్యత తీసుకొని మిర్చి తోటలకు ఎకరాకు లక్ష రూపాయలు పరిహారం అందించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే సమగ్ర సర్వే జరిపి రైతులకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమరనేని అప్పారావు, సండ్ర వెంకట్రావు, కొనిదణ రాజేంద్రప్రసాద్, నల్లమోతు రాజబాబు, వెంపటి రాజా, జి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





వైరా ఎమ్మెల్యేని కలిసిన సీఐ, ఎస్ఐలు

నవతెలంగాణ-కారేపల్లి

నూతన వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్‌ను సింగరేణి సిఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావులు సోమవారం కలిశారు. ఖమ్మంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ అధికారులు మండలంలోని శాంతిభద్రల పై చర్చించారు.

శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

మాలోత్ రాందాస్ నాయక్ ను మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాదారం సర్పంచ్ అజ్మీర నరేష్, నాయకులు మాజీ జెడ్పిటిసి భానోత్ దేవ్లా నాయక్, సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరా లాల్, కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మంది వీరప్రతాప్(టోనీ), గుగులోతు శీను, మల్లెల నాగేశ్వరరావు, గుగులోత్ బీముడు, తోటకూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థినులతో కలిసి... అల్పాహారాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే రాగమయి

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి పట్టణంలోని సమీకృత ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సోమవారం సందర్శించారు. వసతులు, భద్రత, భోజనం అందిస్తున్న తీరు, విద్య తదితర అంశాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు, విద్యార్థినులకు అందుతున్న మెనూ, మంచి చదువు అందించేలా ఉన్నతాధికార్లతో మాట్లాడతానని విద్యార్థినులకు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అల్పాహారాన్ని ఎమ్మెల్యే స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, కమల్‌పాషా, వినుకొండ కృష్ణ, మానుకోట ప్రసాద్, హనుమంతు, టోపీ శ్రీను, జమలయ్య పాల్గొన్నారు.

బ్లీచింగ్ పనులు చేపట్టాలి

- ఎంపీఓ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-పినపాక



మండలంలో 23 గ్రామపంచాయతీల పరిధిలో బ్లీచింగ్ పనులను చేపట్టాల్సిందేనని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు సెక్రటరీలను ఆదేశించారు. సోమవారం ఉదయం నుండి ఆయనే స్వయంగా గ్రామపంచాయతీలో తిరుగుతూ బ్లీచింగ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. గత కొద్ది రోజులుగా కురిసిన తుఫాన్ ప్రభావంతో గ్రామాల్లో చాలా ప్రాంతాల్లో నీరు నిలవలు ఉన్నాయని, సీజన్లో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్న కారణంగా బ్లీచింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో నీటి నిల్వలు ఉన్నచోట్ల నీరు నిలువ లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవడమే కాకుండా, ఆ ప్రాంతాలలో బ్లీచింగ్ చేయాలన్నారు. గ్రామాల్లో చెత్త నిలువ లేకుండా ప్రతిరోజు ట్రాక్టర్ సహాయంతో సేకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఏడీ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

నవతెలంగాణ-ఇల్లందు

తుఫాను వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా, అఖిలభారతం ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ఏడి, ఏవో కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. నష్టపోయిన రైతాంగం తమ వ్యక్తిగత దరఖాస్తులను తీసుకొచ్చి ఏవో కార్యాలయంలో సమర్పించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకురాలు వై సావిత్రి (ఏఐపికేఎస్) జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, ఏఐపీకేఎస్ డివిజన్ అధ్యక్షులు శ్రీరామ్ కోటయ్య, కొమరారం ఎంపీటీసీ అజ్మీర బిచ్చ మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోయిన మొక్కజొన్నఎకరాకు 25వేల రూపాయలు పత్తి ఎకరాకు



50 వేల రూపాయలు మిర్చి ఎకరాకు లక్ష రూపాయలు, పశువులు మనుషులు ఎటువంటి ప్రమాదానికి గురి అయిన వారి ఇండ్లు కూలిపోయిన వారిని గుర్తించి ఆదుకోవాలన్నారు.

రైతు బంధును తక్షణమే విడుదల చేయాలి

- **రైతు సంఘం డిమాండ్**

నవతెలంగాణ -కూసుమంచి

నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానంలో ప్రకటించిన రైతుబంధు పథకాన్ని 10 ఎకరాల్లోపు చిన్న సన్నకారు రైతులందరికీ వెంటనే రైతుబంధును అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్లో పత్తి పంట దిగుబడి పూర్తిగా బడిపోయిందని, మిర్చి పంటలో ఎర్రనల్లి, తెల్ల నల్లి తామర పురుగు కారణంగా మిర్చి పంట 25 శాతం మాత్రం దిగబడి వస్తుందని మొన్న కురిసిన వర్షాలకు, వరి పంటలు తుడవడంతో పంట నష్టం జరిగింది. దీంతో రైతులు బాగా దెబ్బతిన్నారని, కావున ప్రభుత్వం ప్రకటించిన రైతుబంధును యాసంగి పంటలకైనా రైతు ఖాతాలో రైతు బంధు డబ్బులు జమ చేయాలని, దీంతో రైతులకు పెట్టుబడి సహాయంగా ఉపయోగపడుతుందని రైతు సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపిన బట్టు వెంకన్న

నవతెలంగాణ-కామేపల్లి

దండకరణ్యం నుండి నిరుపేద బహుజనులందరి కష్టాలు తీర్చే తెలంగాణ రాష్ట్ర పంచాయత్ రాజ్, శిశు సంక్షేమ, రూరల్ వాటర్ సప్లై అండ్ డెవలప్ మెంట్ మంత్రి సీతక్క కు బట్టు వెంకన్న సోమవారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న పలు సమస్యలను సీతక్కకు విన్నవించి పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతపూర్ బేగంపేట్ లలో ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే గిరిజన హరిజన బాలబాలికలకు కనీస వసతిగృహం లేదని 2017 నుండి గత పాలక ప్రభుత్వాలకు ఎన్నోమార్లు ఏబిఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు అమర్ సింగ్ తిలావత్ నాయకత్వంలో వినతి పత్రాలు పోరాటాలు ధర్నాలు నిరసనలు చేపట్టిన దున్నపోతు మీద వర్షం కురిసిన చందగా ఉందని ఆరోపించారు. హైదరాబాద్ రాలేని పిల్లల తల్లిదండ్రులు ప్రైవేట్ హాస్టల్లో చిన్నపిల్లలను వదిలిపెట్టి వెళ్ళిపోతున్నారు.

గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ రమాదేవి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీతో కలిసి సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. గిరిజన దర్బార్‌లో యూనిట్ అధికారుల సమక్షంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన ఆర్జీలు స్వీకరించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ దర్బార్‌లో పోడు భూముల సమస్యలు, పట్టా భూములకు రైతు బంధు, రుణాలు, వ్యక్తిగత సమస్యలు తదితర సమస్యలపై దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిటిఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏపీఓ పవర్ మునీర్ పాషా, డీఎస్ఓ ప్రభాకర్ రావు, జేడియం హరికృష్ణ, ఉద్యాన శాఖ అధికారి అశోక్, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు బీమా నగదు అందజేత

నవతెలంగాణ-ఎర్రుపాలెం



గత కొద్ది రోజుల క్రితం నుండి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు బీమా నగుదును అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు సోమవారం అందించారు. మండల పరిధిలోని గుంటుపల్లి గోపవరం గ్రామానికి చెందిన సంఘ సభ్యులు మందడుపు అప్పారావు మృతి చెందటంతో నామిని అయినా మృతుడి భార్య కృష్ణ కుమారికి రూ.50 వేల రూపాయల భీమా నగదును ఎర్రుపాలెం డిసిసిబి బ్యాంకు నందు అంద చేశారు. ఈ కార్య క్రమంలో బ్యాంక్ మేనేజర్ మగినం వీరభ ద్రం, అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భానుప్రియ సూప ర్వైజర్ మహేష్, సీఈవో మోహన్రావు, సొసైటీ సిబ్బంది మురళి, రమణారెడ్డి, బ్యాంక్ సిబ్బంది, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

కూనంనేని, కొత్వాలకు ఘన స్వాగతం

నవతెలంగాణ-పాల్వంచ

విజయోత్సవ ర్యాలీ సందర్భంగా పాత పాల్వంచలో సోమవారం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావుకు ఘన స్వాగతం లభించింది. పాత పాల్వంచలోని కొత్వాల గృహం వద్ద వందలాదిమంది మహిళలు, యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా స్వాగతం పలికారు. పొంగులేటి, కూనంనేని, కొత్వాలల నాయకత్వం వర్ధిలాలి అంటూ నినాదాలు చేశారు. మహిళలు మంగళహారతులు పట్టారు. భారీ గజమాలతో, శాలువాలతో కూనంనేని, కొత్వాల ను సన్మానించారు

యశోదలో కేసీఆర్‌ను పరామర్శించిన సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి



ఇటీవల ఇంట్లో జారిపడి కాలికి గాయమై యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆయన్ను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ గాయపడటం బాధాకరమని, త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా సండ్ర భగవంతుని ప్రార్థించారు.



అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం 12, డిసెంబర్ 2023

ఎమ్మెల్యే జారేకి సన్మానం



నవతెలంగాణ-దమ్మపేట

గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణని అశ్వారావుపేట నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కట్రం స్వామి దొర ఆధ్వర్యంలో జారెని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో దమ్మపేట, అశ్వారావుపేట, చంద్రుగొండ, అన్నపరెడ్డి పల్లి మండలాల అధ్యక్షులు ఎండి వలీ పాషా, నార్లపాటి శ్రీనివాసరావు, వారాధి సత్యనారాయణ, పారుగంటి రామారావు, సొసైటీ డైరెక్టర్లు కట్టాం ఎర్రప్ప, నందమూరి నాగు, సంద సుబ్బారావు, వారంపూడి జోగారావు, డాక్టర్ రాము, సున్నం శోభన్, ఆర్లపాటి రమాదేవి, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జారేను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు



పరిధిలోని గండుగలపల్లి గ్రామంలో జారే నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ ఎంపీపీ పానుగంటి సత్యం, దమ్మపేట మాజీ సర్పంచ్ అత్తులూరి వెంకట రామారావు జారే దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. ఇటీవల మండలంలో మిచౌంగు తుఫాను వల్ల పదివేల ఎకరాల్లో రైతులకు పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అండగా నిలబడటంలో జాప్యం చేస్తున్నారని జారేకు తెలిపారు. దీనిపై జారే స్పందిస్తూ తాను చొరవ తీసుకుని వ్యవసాయ అధికారులతో మాట్లాడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల రాంబాబు, పసుమర్తి చిన్నబాబు, ప్రసాదు, ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-టేకులపల్లి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మూడు నెలలకు జరిగే మండల సర్వసభ్య సమావేశం ఎంపీటీసీల కోరం పూర్తిగా లేనందున వాయిదా వేసినట్లు ఎంపీడీవో వీరబాబు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే సర్వసభ్య సమావేశం కోరం పూర్తి కానందున మూడు గంటల వరకు చూసి వాయిదా వేయడం జరిగిందని, మూడు గంటలకు కూడా ఎంపీటీసీల కోరం పూర్తి కానందున వాయిదా వేయడం జరిగిందని అన్నారు. తదుపరి తేదీని ప్రజా ప్రతినిధులకు, వివిధ శాఖల అధికారులకు తర్వాత తెలియజేస్తామన్నారు.

ఆళ్ళపల్లి : మండల కేంద్రంలో సోమవారం ఉదయం 10.30గంటలకు జరగాల్సిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రజా ప్రతినిధులు, సభ్యులు గైర్హాజరీతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో మార్తి రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సమావేశానికి రావాల్సిన మండల పాలకులు, సభ్యులు ఎవరూ రాకపోవడంతో గంట వాయిదా వేసినా, మండల పాలకులు, సభ్యులు ఎంతకీ హాజరు కానందున తదుపరి జరిగే సమావేశం వరకు వాయిదా వేయడం జరిగిందని ఎంపీడీవో పేర్కొన్నారు.

జాతీయ సమావేశాలకు సోమశేఖర్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 15 నుండి 17 వరకు ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ (ఎఐఓసిడి) ఆధ్వర్యంలో జరుగు జాతీయ కెమిస్ట్ సమావేశాలకు తొలిసారిగా భద్రాచలంకు చెందిన కెమిస్ట్ పరిమి సోమశేఖర్‌కు ఆహ్వానం అందినది. గత 23 సంవత్సరాలగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పాల్వంచ భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో 12 మండలాలకు డివిజన్ సెక్రెటరీగా, డివిజన్ అధ్యక్షులుగా, జిల్లా కార్యదర్శిగా పలు పదవులు నిర్వహించిన సోమశేఖర్‌కు ఈ అవకాశం రావడం పట్ల డివిజన్ వ్యాప్తంగా కెమిస్ట్‌లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సోమశేఖర్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా, తెలంగాణ టీటీసీడీఏ సభ్యులగా కొనసాగుతున్నారు.

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసిన రేషన్ డీలర్లు



నవతెలంగాణ-టేకులపల్లి

ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్యను టేకులపల్లి మండలంలోని స్వగ్రామమైన కోయగూడెంలో రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘము జిల్లా అధ్యక్షులు ఊకె శేఖర్ రావు, ఉపాధ్యక్షులు ఎ.రామ, మండల అధ్యక్షులు ఎ.సంతు లాల్, మండల డీలర్లు బి.బాలు, జి.హేమచందర్, జి.కళ్యాణ్, డి.తవురియా, వెంకటేష్, గోపి, భాస్కర్, నగేష్ రావు పాల్గొన్నారు.

రూ.78 వేల విలువచేసే టేకు కలప పట్టివేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం అటవీ రేంజ్ పరిధిలోని చింతగుప్ప పరిసర ప్రాంతాల్లో అక్రమంగా రవాణాకు సిద్ధంగా ఉంచిన రూ.78 వేల అక్రమ కలపను సోమవారం అటవీశాఖ అధికారులు స్వాధీన పరుచుకున్నారు. అక్రమ టేకు కలప రవాణాకు సిద్ధంగా ఉందని తెలుసుకున్న దుమ్ముగూడెం అటవీ రేంజి అధికారి కనకమ్మ, డిప్యూటీ రేంజ్ అధికారి శోభనాయక్‌లు అటవీ సిబ్బందితో కలిసి దాడి చేసి అక్రమ టేకు కలపను స్వాధీన పరుచుకున్నారు. ఈ దాడిలో ఎఫ్‌బీఓ విజయతోపాటు అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ వ్యాధులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో గల భవిత కేంద్రంలో క్యాన్సర్ వ్యాధులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల రిసోర్స్ పర్సన్ రాగిణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బసవతారకం ఇండో అమెరికన్ హాస్పిటల్, సర్వ శిక్ష అభియాన్ తెలంగాణ ఆధ్వర్యంలో డాక్టర్ ముకుంద రెడ్డి సహకారంతో నిర్వహించే క్యాన్సర్ పరీక్షల్లో గ్రహణ మొర్రి, పెదవి చీలిక, అంగిలి చీలిక వంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరు నెలల వయసు నుండి 50 సంవత్సరాల వయసుగల వారికి ఈ పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం జి.సతీష్ 7981104457 అనే ఫోన్ నెంబర్ను సంప్రదించవచ్చు అన్నారు.

తుఫాన్ బాధిత రైతులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలి

నవతెలంగాణ-గుండాల

మిచైంగ్ తుఫానుతో పత్తి, మొక్కజొన్న, మిర్చి, వరి, తదితర పంటలు నష్టపోయిన బాధిత రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని గుండాల జెడ్పీటీసీ, ఎంపీపీ వాగబోయిన రామక్క, ముక్తి సత్యం పార్టీ జిల్లా నాయకులు బట్టు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో తుఫాన్ బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఎన్డీ పార్టీ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల ఎన్నికల సమయంలో రంగురంగుల జెండాలతో గ్రామాల్లోకి వచ్చిన నాయకులు ఇటీవల కాలంలో వచ్చిన మిచైంగ్ తుఫానుతో ఉమ్మడి పాత గుండాల మండలంలో అనేక గ్రామాలలో చాలా మంది రైతులు పంట చేతికి వచ్చే సమయంలో తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. బాధిత రైతులను పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు, నేడు, రేపు పేద రైతు కుటుంబాల పక్షాన పోరాడేది ఈ ఎర్రజెండా పట్టుకున్న న్యూ డెమోక్రసీ పార్టీయేనని అభివర్ణించారు. అనంతరం స్థానిక తహసీల్ లో తహశీల్దార్ రంగకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీ పార్టీ మండల నాయకులు ఈసం కృష్ణ, షేక్ అజ్గర్, అరెం నరేష్, బత్తిని సత్యం, గడ్డం లాలయ్య, కిషన్, పాయం ఎల్లన్న, తాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల పై కళాజాత

నవతెలంగాణ-టేకులపల్లి

ఆరు గ్యారెంటీలపై జిల్లా సమాచార పౌర సంబందాల శాఖ డీపీఆర్‌ఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో సంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ పథకాల పై టేకులపల్లి సెంటర్‌లో కళాజాత సోమవారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బాలు, ముసా, నందు, నరేంద్ర, నీలా, స్నేహ, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్ సూపరిండెంట్ ఉపేంద్రని కలిసిన గ్రీన్ భద్రాద్రి సభ్యులు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం సూపరిండెంట్‌గా నూతనంగా వచ్చిన జిడుగు ఉపేంద్రని గ్రీన్ భద్రాద్రి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పామే జాతికి చెందిన సైకస్ మొక్కను బహుకరించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు డాక్టర్ గోళ్ళ భూపతి రావు, కామిశెట్టి కృష్ణార్జునరావులు సబ్ జైలర్ ఉపేంద్రని కలిసి సబ్ జైల్లో ఉన్న మొక్కలను పరిశీలించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ గ్రీన్ భద్రాద్రి వారు పర్యవరణ పరిరక్షణకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మా వంతు సహకారం మీకు ఎప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ప్రజా దర్బార్‌కు తరలివచ్చిన ప్రజలు
- దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్
- చర్యలకు అధికారులకు సిఫార్సు



నవతెలంగాణ-పాల్వంచ

ప్రజా దర్బార్‌లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజాధర్బార్ నిర్వహించి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్య దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందజేసిన దరఖాస్తులపై తీసుకునే చర్యలపై నివేదికలు అందజేయాలని చెప్పారు. దరఖాస్తులను ఎండార్స్మెంట్ చేసి ఆయా శాఖల అధికారులకు తగు చర్య నిమిత్తం సిఫార్సు చేసినట్లు చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించినట్లయితే మణుగూరు మండలం విప్పల సింగారం గ్రామానికి చెందిన తన్నీరు రమేష్ బీటీపీఎస్ రైల్వే ట్రాక్ నిర్మాణంలో నివాస గృహాలు కోల్పోయిన తనకు ఆర్అండ్ఆర్ కాలనీలో 110 గజాలకు బదులుగా కేవలం 60 గజాల స్థలం మాత్రమే కేటాయించాలని తనకు 110 గజాల ఇంటి స్థలం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ తక్షణమే తగు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అశ్వాపురం మండలం, హమీర్ద గ్రామానికి చెందిన గుజ్జుల వెన్నారెడ్డి వెంకటలక్ష్మి (80) వృద్ధ దంపతులు. తమకు ముగ్గురు కుమారులు స్థిరాస్తి మొత్తాన్ని ఐదు ఎకరాలు చొప్పున పంచుకున్నారని, తమ సంరక్షణకు నాలుగు ఎకరాలు పెద్ద కుమార్తెకు ఇచ్చామని, అట్టి భూమి కూడా తమకే ఇవ్వాలని ఇబ్బందులు గురి చేస్తున్నారని పోలీస్ స్టేషన్ల ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగడంలేదని తెలిపారు. విచారణ నిర్వహించి తమకు న్యాయం చేయాలని చేసిన ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ లీగల్ సెల్ అధికారులకు సిఫార్స్ చేశారు. పాల్వంచ మున్సిపాలిటీ మూడో వార్డు గాంధీనగర్ శేఖర్ బంజరకు చెందిన ప్రజలు మురుగు కాల్వ నిర్మాణం కోసం గుంతలు తీశారని దాదాపు మూడు నెలలు గడిచిపోయాయని పూర్తి చేయని కారణంగా కాలువ దాటడం ఇబ్బందిగా ఉందని దానిలో పడిపోతున్నారని, అలాగే కాల్వ పూర్తి వల్ల మంచినీటి సరఫరా కూడా నిలిచిపోతుందని తక్షణం పూర్తి చేయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో కలెక్టర్ చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. సింగరేణి మండల పరిధిలోని రేలాకాయ పల్లి పాయల్ తండా గేటు రేలకాయలపల్లి మూడు తండా రంగు రాళ్లబోడు గ్రామాలకు చెందిన గిరిజన రైతుల రుణాలు మంజూరు చేస్తామని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఫీల్డ్ ఆఫీసర్ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు కలిగిన భూములు పత్రాలను తీసుకెళ్లారని, తదుపరి బ్యాంకుల్లో నోటీసు బోర్డులో పెట్టారని కొన్ని గ్రామాలకు పంట రుణాలు మంజూరు చేశారని, మా గ్రామ ప్రజలు ఉన్న రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని చేసిన దరఖాస్తుల పరిశీలించిన కలెక్టర్ ఎల్డీఎంకు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాష్ నగర్కు చెందిన నెట్ సుజాత తాను తన కూతురు ఇద్దరం సికిల్ సెల్ అనిమీయాతో బాధపడుతున్నామని తన భర్త కిడ్నీ వ్యాధితో 2019 సంవత్సరంలో మరణించారని, కుమారుడు 2018లో డెంగీ వ్యాధితో మరణించారని నిరుపేదలమైన తాము ప్రతినెల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకుంటూ జీవనం సాగిస్తున్నామని తన కూతురు ల్యాబ్ టెక్నీషియన్ కోర్స్ చేసినందున ఉద్య అవకాశం కల్పించాలని చేసిన దరఖాస్తు తమ చర్యల నిమిత్తం జిల్లా వైద్యాధికారికి ఎండార్స్ చేశారు. జడ్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారసులకు కారణ నియమగల ద్వారా ఉద్యోగ కోసం కల్పించాలని 11 మంది అభ్యర్థులు చేసిన దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ జెడ్పి సీఈవోకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నియోజక వర్గ అభివృద్ధికి నిర్విరామ కృషి

- ఆశీర్వదించిన ప్రజానీకానికి జీవితాంతం రుణపడి ఉంటా
- ఎమ్మెల్యేగా మొదటి పర్యటనలో 'జారే'





నవతెలంగాణ-అశ్వారావుపేట

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సకల సామాజిక వర్గాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఆ దృఢంతో నే గత ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి ఆ పార్టీ అభ్యర్థులను అత్యధిక ఆధిక్యంతో విజయం కట్టబెట్టారని అన్నారు. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట మండలంలో ఎమ్మెల్యేగా మొదటి సారిగా సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలలో 'మహాలక్ష్మీ' 'రాజీవ్ ఆరోగ్య శ్రీ' అనే రెండు పథకాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. దమ్మపేట మండలం గండుగుల పల్లిలోని తన స్వగృహం నుండి బయలు దేరిన ఆయన ముందుగా అశ్వారావుపేటలోని ఆంజనేయ దేవాలయంలో పూజలు నిర్వహించి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వందని సమర్పించిన అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో "మహాలక్ష్మి" పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సర్వీస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. మహిళా ప్రయాణికులతో కొద్ది సేపు ముచ్చటించారు. అదే బస్సులో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 'రాజీవ్ ఆరోగ్య శ్రీ' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలు, రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని హమీ ఇచ్చారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం, అభివృద్ధికి చేయూతగా నిలుస్తానని ప్రకటించారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ వరలక్ష్మి, అశ్వారావుపేట సొసైటీ అధ్యక్షులు చిన్నం శెట్టి సత్యనారాయణ, సర్పంచ్‌లు అట్టం రమ్య, నార్లపాటి సుమతి, ఎంపీటీసీలు వేముల భారతి ప్రతాప్, సత్యవరపు బాలగంగాధర్, మిండ హరిక్రిష్ణ, ఆర్టీసీ సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సీతా రాం నాయక్, ఎంవీఐలు ఎం.శ్రీనివాస్, ఎం.వెంకటరమణ, నోడల్ ఆఫీసర్ మణికంఠ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణ చంద్, ఆర్ఎంఓ క్రిష్ణ కాంత్, ఎంపీడీవో జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుక కమ్యూనిస్టులు

- కాసాని, కూనంనేని



నవతెలంగాణ-సుజాతనగర్

కమ్యూనిస్టులు ప్రజల గొంతుకగా ఉంటారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య అన్నారు. సోమవారం కాసాని ఐలయ్య స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి తన గెలుపుకు కృషి చేసినందుకు కూనంనేని శాలువతో ఐలయ్యను సన్మానించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. చట్టసభలలో ప్రజా సమస్యలపై పోరాడాలంటే కమ్యూనిస్టు పార్టీలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై వామపక్షాల తరుపున తమ గళం వినిపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు లిక్కీ బాలరాజు, మండల కార్యదర్శి వీర్ల రమేష్ తదితరులు ఉన్నారు.

తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-ములకలపల్లి

మిచౌంగ్ తుపాను ప్రభావం వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కమిటీ సభ్యులు పోతుగంటి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కమిటీ, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం మండల కమిటీల ఆధ్వర్యంలో మండలంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం తహశీల్దార్ పుల్లారావుకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన వేరుశెనగకు రూ.30వేలు, వరి, మొక్కజొన్నకు రూ.25వేలు, పత్తి రూ.50వేలు, మిర్చికి రూ.లక్ష చొప్పున ఎకరానికి పంట పరిహారం అందించాలని, ఇండ్లు కూలిపోయిన వారిని గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తడిచిన పంటలను ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాల కార్యదర్శులు కొర్సా రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు నకిరికంటి నాగేశ్వరరావు, ఓరుగంటి శ్రీను, శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజా సేవలో ప్రజా ప్రభుత్వం

- పేదలకు కార్పొరేట్ వైద్యం
- 100 పడకల ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే పాయం



నవతెలంగాణ-మణుగూరు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవలో ప్రభుత్వ వైద్యం అందిస్తుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక 100 పడకల ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్య శ్రీ 10 లక్షల పథకాన్ని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాలను ప్రారంభించి మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన అద్భుత పథకాన్ని అన్ని రకాల పేదలకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాలలో భాగంగా ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా 10 లక్షలు వెచ్చించిందని అన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసిందన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రిగా శంకుస్థాపన చేశానని, 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేశానని అన్నారు. ప్రస్తుతం 100 పడకల ఆస్పత్రిలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మణుగూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి బీటీపీఎస్ వరకు తమ హయాంలోని శంకుస్థాపన జరిగాయి అన్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో అర్హత ఉన్నవారికి వంద శాతం ఉద్యోగ అవకాశాలు ఇస్తానని హామీ ఇచ్చారు. అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ రాజు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని ఆరోగ్య ఆశ వర్కర్లు సిబ్బంది అన్ని గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అనంతరం మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఆర్టీసీ జీఎం స్వామి ఆధ్వర్యంలో పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, అశ్వాపురం జడ్పిటిసి ముత్తినేని సుజాత, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సంజీవరావు, డాక్టర్ చందా సంతోష్, కోఆర్డినేటర్ కాటుబోయిన నాగేశ్వరరావు, సంసింగారం సర్పంచ్ బచ్చల భారతి, వైస్ ఎంపీపీ కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వరం ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం

- ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం



నవతెలంగాణ-ఇల్లందు

మహిళలందరికీ మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం వరమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. స్థానిక కొత్త బస్టాండ్‌లో సోమవారం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎంతో ధైర్యంతో ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రవేశపెట్టడం హర్షనీయమన్నారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు రాష్ట్ర ప్రజలు కూడా ఎన్నికలలో గెలిపించి ప్రభుత్వాన్ని బహుమతిగా అందించడం సంతోషకరమన్నారు. ఆధార్ కార్డు చూపెడితే రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు అన్నారు. రద్దీ దృష్ట్యా మరిన్ని బస్సులు ప్రవేశపెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డివి, కొత్తగూడెం డిఎం బాణాల వెంకటేశ్వరరావు ట్రాఫిక్ సిఐ బికె.రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వరం రాజీవ్ ఆరోగ్యశ్రీ

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం ఆరు గ్యారెంటీల కార్యక్రమం అమలులో భాగంగా వైద్యానికి అయ్యే ఖర్చులు రూ.10 లక్షల ప్రభుత్వం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత డిసిహెచ్ రవిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న సమస్యలను, సిబ్బంది వైద్యుల కొరతను వారి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ఈ పథకం కుటుంబానికి భరోసా కల్పిస్తోందన్నారు. అనంతరం పేదలకు వైద్య సేవలు అందించే కరపత్రాన్ని ఆవిష్కరించారు. అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ సుకృత, సూపరిండెంట్ వెంకన్న, ఆర్ఎం హర్షవర్ధన్, డాక్టర్ బన్నీ, హెడ్ నర్స్ జగదాంబ, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది తదితరులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు.



నూతన ఎమ్మెల్యేకు అభినందనలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శాసన సభకు ఎన్నికైన నూతన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఎంపీడీవో సంఘం జిల్లా అధ్యక్షుడు మార్తి రామారావు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోమవారం నూతన ఎమ్మెల్యేను ఆ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో సంఘం సభ్యులు వివేక్ రాం, గంట వరప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీఓల సంఘం

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును నియోజకవర్గం ఎంపీఓల సంఘం నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందని ఆళ్ళపల్లి, గుండాల ఎంపీఓలు బి.శ్రీనివాసరావు, షేక్ హజరత్ అలి ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా నూతన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించినట్లు వారు పేర్కొన్నారు. సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ప్రయివేటీకరణ ఆగాలంటే ఏఐటీయూసీని గెలిపించండి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి ప్రయిటీకరణ ఆపాలంటే ఏఐటీయూసీని గెలిపించాలని సింగరేణి వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ పిలుపునిచ్చారు. సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మణుగూరులోని ఓసీ 4 నందు ఫిట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తూ అహర్నిశలు ప్రైవేటీకరణ పై పోరాడుతున్న ఏఐటీయూసీని గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి 29 వేల కోట్ల పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందని సింగరేణి సంస్థ ప్రతి నెల కార్మికుల జీతాల కోసం బ్యాంకుల వద్ద అప్పులకు పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సంస్థ మనుగడకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. ఈ నెల 15 శుక్రవారం పివి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగే జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని అన్నారు. 27న జరిగే ఎన్నికలలో ఏఐటీయూసీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మల్లెల రామ నరసయ్య, జాయింట్ సెక్రటరీ పి.పుల్లారావు, ట్రెజరర్ ఆవుల నాగరాజు, ఆఫీస్ బేరర్స్ నంబూరు శ్రీనివాసరావు, ఆదర్ల సురేందర్, ఎస్కే సుభాని పిట్ సెక్రటరీలు కోడి రెక్కల శ్రీనివాసరావు, బండారి రవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కందిమల్ల శ్రీనివాస్, పాపారావు, గణపతి, భీమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

- కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి వినతి

నవతెలంగాణ-పాల్వంచ



మిచౌంగ్ తఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి తదితరులు సోమవారం కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం ద్వారా డిమాండ్ చేశారు. తుఫాను వల్ల జిల్లాలో 7,560 మందికి చెందిన 14,500 ఎకరాల్లో వరి, వేరుశనగ, మొక్కజొన్న, మిరప, పత్తి తదితర పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వమే ప్రకటించిందని, కానీ ఇంతకు మించిన నష్టం జరిగిందని తెలిపారు. దీనితో బాధిత రైతులు చేతికొచ్చిన పంటలు నీట మునిగిపోవటం వల్ల నష్టాన్ని భరించలేక తీవ్రమైన ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి అన్ని విధాల ఆదుకోవాలని వరి, మొక్కజొన్నలకు ఎకరానికి రూ.2,5000, పత్తికి 50,000, వేరుశనగకు 30,000, మిరప పంటకు రూ.100,000 నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాయిని రాజు, మాచర్ల సత్యం, అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్, నూపా భాస్కర్, కల్లూరి కిశోర్, వై ఆజాద్, డివిజన్ నాయకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు : జారే



నవతెలంగాణ-అశ్వారావుపేట

ప్రకృతి అనుకూలించక ఇప్పటికే రైతులు అనేక ఇక్కట్లకు గురి అయ్యారని, తడిసిన ధాన్యం నెపంతో తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని వ్యవసాయ ఉప సంచాలకులు అఫ్జల్ బేగంకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సూచించారు. ఎమ్మెల్యేగా మొదటి సారిగా నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో సోమవారం పలు పంచాయితీల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. అశ్వారావుపేట పట్టణ శివారులో ఏర్పాటు చేసిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఊట్లపల్లి, వినాయకపురం, మల్లాయిగూడెం, పండు వారి గూడెం, దిబ్బ గూడెం, రామన్నగూడెం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఆయన వెంట నాయకులు మొగళ్ళపు చెన్నకేశవ రావు, జూపల్లి రమేష్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, పార్థసారథి, మోహన్ రావు, వీరభద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారేను కలసిన మండల కో ఆప్షన్ సభ్యులు

నవతెలంగాణ-ములకలపల్లి



అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మండల ప్రజాపరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ జబ్బార్, మండల టిడిపి నాయకులు కీసరి లక్ష్మణరావు, కనకం వెంకటేశ్వర్లు, కంటే రామకృష్ణ, కీసరి శ్రీనులు సోమవారం గండుగులపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జారేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన విజయం కోసం కష్టపడిన ప్రతికార్యకర్తకు అండగా ఉంటానని, సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా వాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఎన్నిక



నవతెలంగాణ-మణుగూరు

రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా వాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి (శ్రీ భార్గవ ఆటోమొబైల్స్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంఘం నూతన అధ్యక్షులుగా విజయ భాస్కర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కొత్త అధ్యక్షులు వారి సమక్షంలో డిసెంబర్ 24వ తేదీన రెడ్డి సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేయుటకు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్టు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అన్వేష్ ఎంపిక

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని కొత్తపెల్లి గిరిజన బాలుర వసతి గృహంకు చెందిన 9వ తరగతి విద్యార్థి నూప అన్వేష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపిక య్యాడు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నందు జరిగిన యు-14 సంవత్స రాల జూనియర్ పాఠశాలల స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలలో (ఎస్‌జిఎఫ్) ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టులో ఆడేందుకు అన్వేష్ ఎంపిక అయ్యాడు. అదేవిధంగా ఖమ్మం జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు మహబూబ్ నగర్ జిల్లా యందు నారాయణ పేటలో ఈ నెల 13, 14, 15 తేదీలలో జరిగే క్రీడల్లో ఆయన పాల్గొనను న్నారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినీని ఏటీడీవో పూణెం నరసిం హారావు, ప్రధానోపాధ్యాయులు మడకం మోతిరు, సీనియర్ ఉపాధ్యాయులు కారం సర్వేశ్వరరావు, పీడీ బట్ట హరికృష్ణ, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఏఐటీయూసీని గెలిపించండి

నవతెలంగాణ-టేకులపల్లి

కార్మిక వర్గ దిక్సూచి, వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీని గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేటసిగని వద్ద సింగరేణి ఎన్నికల ప్రచారం సోమవారం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. 27వ తేదీన జరుకు ఎన్నికల్లో పోరాడే సంఘం ఏఐటీయూసీ నక్షత్రం (చుక్క) గుర్తుకు ఓటు వేసి కార్మిక హక్కులను కాపాడు కోవాలని సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య బ్రాంచి కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్‌లు అన్నారు. ఈ సమావేశంలో బ్రాంచి ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్, బ్రాంచి సహాయ కార్యదర్శి కొంగర వేంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుగులోత్ రాంచందర్, బొల్లి కొమరయ్య, ఫిట్ సహాయ కార్యదర్శి షేక్ సర్వర్, వేంగళ రవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురికి శిక్ష

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జ్ (స్పెషల్ జడ్జ్ ఎన్‌డిపిఎస్ యాక్ట్) శుక్రవారం ఎం.శ్యాం శ్రీ తీర్పు చెప్పారు. భద్రాచలం టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ వి.వెంకటేశ్వర రావు తమ సిబ్బందితో 23-02-2021న భద్రాచలం, ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద చేస్తుండగా ఒరిస్సా రాష్ట్రంలో గుర్తు తెలియని వ్యక్తుల నుండి తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు హైదరాబాదులో అమ్ముకొని అధిక లాభాలకు అమ్ముదామని 1)విశాఖపట్నం జిల్లా సంధికోరికి చెందిన కొర్రా రవి, 2)విశాఖపట్నం కాట్రగడ్డకు చెందిన కిల్లో భగవాన్, 3) విశాఖపట్నం దుప్పలవాడకు చెందిన కొర్రా రాజారావు, 4)విశాఖపట్నం సంధి కోరికి చెందిన పంగి బాలమ్మ, 5) హైదరాబాద్‌కు చెందిన నర్సింగ్, 6) విశాఖపట్నం చింతపూడికి చెందిన కొర్ర ధారా బాబు 28 కేజీలు గంజాయి ప్యాకెట్లు విలువ రూ.32,88,000 దొరుకగా వారు నేరము ఒప్పుకున్నారని, పంచనామా ద్వారా ఆట్టి గంజాయి ప్యాకెట్లను సీజ్ చేసి అప్పటి భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.స్వామికి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నాడు. అప్పటి స్వామి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నలుగురు సాక్షులను విచారించారు. 1) కొర్ర రవి 3)కొర్ర రాజారావు 4) పంగి బాలమ్మలపై నేరం రుజువు కాగా, ఒక్కొక్కరికి 10 సంవత్సరముల కఠిన కారాగార శిక్ష, ఒక లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. 2) కిల్లో భగవాన్, 5) నర్సింగ్‌లు పరారిలో ఉన్నారు. 6) కొర్రా దారా బాబు పై నేరము రుజువు కాలేదని కేసు కొట్టి వేస్తూ తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయకుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు. లైజాన్ ఆఫీసర్ ఎం.హరి గోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ భద్రాచలం టౌన్ ఏఎస్‌ఐ గంజి శశిధర్‌లు సహకరించారు.

డాక్టర్ మద్దిశెట్టికు లెజెండరీ అవార్డు ప్రదానం

నవతెలంగాణ-జూలూరుపాడు



పాపకొల్లు రిటైర్డ్ హెడ్ మాస్టర్ డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను అందించినందుకు ప్రతిష్టాత్మకమైన విద్యా లెజెండరీ అవార్డు ప్రదానం చేసారు. విజయవాడలోని తెలుగు వెలుగు సాయి తేజ తెలుగు వెలుగు సాహితీ సంస్థ సాహితీ సంస్థ బాల భవన్‌లోని విజయవాడలో వీరికి పోలో రాజకుమార్, డాక్టర్ రంగశెట్టి రమేష్, వంగాల శాంతి కృష్ణ ఆచార్య, మోహన్ రావు, కటకం రాజేంద్రప్రసాద్, అనిల్ కుమార్ శర్మ, డాక్టర్ ఎం.వెంకటరమణ, వెంకటేశ్వరరావులకి గోల్డ్ మెడల్ మెమెంటో నంది పురస్కారంతో సన్మానించారు. వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా కేజీబీవీ పాఠశాలలో, మహాత్మ జ్యోతిబా పాఠశాలలో ఎస్ఓగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి అనేక మన్ననలను పొందారు. విద్యార్థుల పట్ల విద్యార్థుల అభివృద్ధి పట్ల వీరికున్న సేవా స్ఫూర్తి గతంలో ఆరు గోల్డ్ మెడలో 15 అవార్డులు సాధించారు. వీరిని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, మిత్రులు, గ్రామస్తులు ప్రశంసలతో ముంచెత్తారు.

కూనంనేని విజయోత్సవ ర్యాలీ

చట్టసభలో జనం గొంతుకనవుతా

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం



చట్టసభలో జనం గొంతుకనవుతానని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యతను విస్మరించబోనని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సోమవారం సీపీఐ, మిత్రపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కొత్తగూడెం నియోజకవర్గంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని సుజాతనగర్ మండలం డేగల మడుగు గ్రామం నుండి భారీ జన సందోహం నడుమ కూనంనేని విజయోత్సవ ర్యాలీ సాగింది. సుజాతనగర్, చుంచుపల్లి కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాత పాల్వంచ మీదుగా పెద్దమ్మ గుడి జగన్నాథపురం వరకు సాగింది. గ్రామ గ్రామాన జనం నీరాజనం పలికారు. కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో గల అమరవీరుల స్థూపం వద్ద పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. మిత్రపక్షాల పార్టీల నాయకులు కార్యకర్తలు అహర్నిశలు కష్టపడి తన గెలుపులో భాగమయ్యారని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ ప్రాంతానికి తను ఎనలేని కృషినందిస్తానని చెప్పారు. పాల్వంచ, కొత్తగూడెం రెండు ప్రాంతాలు మున్సిపాలిటీగా చలామణి అవుతున్నాయి, ఈ రెండింటిని కలిపి కార్పొరేషన్ ఏర్పాటు కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి కార్పొరేషన్ అయ్యేవిధంగా చేస్తానన్నారు. కొత్తగూడెం పరిసర ప్రాంతాలైన నరసింహసాగరం డేగల మడుగు, మంగపేట, నిమ్మలగూడెం, సుజాతనగర్ లాంటి ఏజెన్సీ లేని ప్రాంతాలలో కొన్ని పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని అన్నారు. గత 45 ఏళ్ల నుండి ఈ ప్రాంత ప్రజలు నాపై చూపుతున్న ప్రేమ ఎనలేనిదని అన్నారు. ప్రతి పేదవాడి అవసరాలను వారి స్థితిగతులను అనుక్షణం తెలుసుకుంటూ వారికి చేదోడు వాదోడుగా ఉంటూ ప్రభుత్వము నుండి అందవలసిన పథకాలను అందే వరకు వారి పక్షాన నిలబడి కొట్లాడతానన్నారు. ఈ విజయోత్సవ ర్యాలీలో అభిమానులు, వివిధ కుల సంఘాల నాయకులు, వ్యాపార వర్గాలు, రాజకీయ నాయకులు కూనమనేనికి నీరాజనాలు పట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ శంకర్ నాయక్, నాగ సీతారాములు, తోటా దేవి ప్రసన్న, దాంతోటి పౌల్, సీపీఐ(ఎం) నాయకులు కాసాని ఐలయ్య, వీర్ల రమేష్, నల్లగోపు పుల్లయ్య సిపిఐ నాయకులు బందెల నర్సయ్య, ముత్యాల విశ్వనాథం, దుర్గారాశి వెంకన్న, సలిగంటి శ్రీనివాస్, భూక్య దస్రు, వాసిరెడ్డి మురళి, వి.పూర్ణచందర్ రావు, ఏ.సాయిబాబు, కె.జమలయ్య, వీరస్వామి, మల్లికార్జున్ రావు, కె.రత్నకుమారి, ధనలక్ష్మి, లక్ష్మీపతి, రాహుల్, భూక్య శీను, మునిగడప వెంకన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై 18, 19 తేదీల్లోఛలో ఢిల్లీ

- మాదిగ యూత్ జేఏసీ జిల్లా అధ్యక్షులు రమేష్

నవతెలంగాణ-పాల్వంచ



ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో కార్యక్రమానికి పిలుపునిచ్చిన మాదిగ యూత్ జేఏసీ జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాని మోడీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద కమ్యూనిటీగా ఉన్న మాదిగ కులానికి ఉప ముఖ్యమంత్రి పదవిని ఇవ్వాలని కోరారు.

సింగరేణి ఎన్నికల్లో పోరాడే సీఐటీయూని ఆదరించండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి ఎన్నికల్లో కార్మిక పక్షాన పోరాడే సీఐటీయూ గెలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కమిటీ సమావేశం ములకల ఉత్తమ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కనకయ్య మాట్లాడుతూ మణుగూరు పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కువ మంది కార్మికులు ఉన్నారని, వారి కలల సహకారం కోసం సీపీఐ(ఎం), సీఐటీయూ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. సింగరేణి కార్మికులకు జీతాలు వారి సొంతింటి కల నెరవేర్చడం కోసం పోరాటం చేస్తుందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సిఐటియు పోరాటం చేసి ఇప్పిచ్చిందన్నారు. లాభాల్లో వాటా కోసం సీఐటీయూ శక్తివంతంగా పనిచేస్తుందని అన్నారు. కార్మికుల కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తుందని అన్నారు. ప్రస్తుతం ఎన్నికలు అంటే డబ్బు స్వార్థంతో రాజకీయాలు ముడిపడ్డాయని అన్నారు. కార్మిక లోకం నిజాయితీగల సీఐటీయూ నీగెలిపిస్తే కార్మిక హక్కుల కోసం పోరాడుతుందని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, మాచారపు లక్ష్మణరావు, పిట్టల నాగమణి, పద్మ, సుధాకర్, ములకల ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పై భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



మాజీ సీఎం కేసీఆర్‌పై భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌లో అనేక రకాల కారణాలతో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిగా పోటీ చేసిన పూనెం ప్రదీప్ కుమార్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి హెూదాలో కేసీఆర్ భద్రాచలం పట్టణంలో మూడుసార్లు పర్యటించడం జరిగిందని, 2016వ సంవత్సరంలో శ్రీరామనవమి సందర్భంగా వచ్చిన ఆయన రాముల వారి ఆలయ అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులను తక్షణమే కేటాయించడం జరుగుతుందని తెలిపి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని మోసం చేశాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2022వ సంవత్సరంలో గోదావరి వరదల బీభత్సవానికి తల్లడిల్లుతున్న భద్రాచలం పట్టణానికి వచ్చిన కేసీఆర్ గోదావరి వరదల నుండి భద్రాచలం పట్టణాన్ని కాపాడేందుకు కరకట్ట ఎత్తు, పొడుగు పెంచేందుకు, ముంపు కాలనీల పునరావాసం కోసం అత్యాధునిక సదుపాయాలతో ఇల్లు నిర్మించి వరద బాధితులకు ఇచ్చేందుకు తక్షణమే వెయ్యి కోట్ల రూపాయల నిధులను కేటాయించడం జరుగుతుందని, ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఈ ప్రాంత ప్రజలను మోసం చేశాడని ఆయన అన్నారు. 2014వ సంవత్సరంలో హైదరాబాదులో ఏర్పాటు చేసిన గిరిజన సదస్సులో కేసీఆర్ మాట్లాడుతూ ప్రతి గిరిజన కుటుంబానికి మూడు ఎకరాల ప్రభుత్వ భూమి, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టకుండా గిరిజన సమాజాన్ని మోసం చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు.

అలాగే తెలంగాణ ఉద్యమ సమయంలో భద్రాచలం వచ్చిన సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే భద్రాచలం జిల్లాను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీను నెరవేర్చకుండా భద్రాచలం ప్రాంత వాసులను మోసం చేశారని ఇచ్చిన హామీలను నిలుపుకోకుండా మోసం చేసిన కేసీఆర్, తన్నీరు హరీష్ రావులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- భారీ మెజారిటీతో ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు
- అవకాశం కల్పించిన మంత్రి పొంగులేటికి ధన్యవాదాలు
- విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కోరం

నవతెలంగాణ-ఇల్లందు



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఇల్లందుకు విచ్చేసిన సందర్భంగా సోమవారం ఇల్లందులో జరిగిన భారీ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపించారు. పూలమాలలు వేసి భాజా భజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. బొజ్జాయిగూడెం నుండి ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ సుభాష్ నుండి జెకె ఏరియా జగదాంబ సెంటర్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా గోవింద్ సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడ జరిగిన సభలో మాట్లాడారు. నియోజవర్గ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారని ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశలు అమ్ము చేయకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చి గెలిపించడానికి అన్ని విధాల సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ తోటే అభివృద్ధి సాధ్యమన్నారు. నాలుగు రోజుల్లోనే రెండు హామీలు నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదే అన్నారు. ఈ ర్యాలీలో ఐదు మండలాల నుండి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొన్నారు.

కోరం కనకయ్య విజయోత్స ర్యాలీ

టేకులపల్లి : మండల కేంద్రమైన టేకులపల్లిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య విజయోత్స ర్యాలీ సోమవారం నిర్వహించారు. మండలంలోని గోలియా తండ సమీపంలో మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కోరంకు ఘన స్వాగతం పలికారు. అక్కడినుండి టేకులపల్లి బస్టాండ్ సెంటర్లోని పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం మాట్లాడారు. ఆదరించి గెలిపించినందుకు మీకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య దేవానాయక్, సర్పంచులు బోడ సరిత, బోడ నిరోషా, కోరం ఉమా, అజ్మీర బుజ్జి, మోకాళ్ళ రమాదేవి, మాజీ సర్పంచులు కోరం సురేందర్, ఇస్లావత్ రెడ్డి నాయక్, బానోత్ బుజ్జి, బద్రు, ఎంపీటీసీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఓడినా, గెలిచినా నిరంతరం పోరాడేది ఎర్రజెండా ఒక్కటే

నవతెలంగాణ-చర్ల

ప్రజాక్షేత్రంలో గెలిచినా, ఓడినా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండా అని మండల కమిటీ సభ్యులు మచ్చా రామారావు అన్నారు. సోమవారం స్థానిక బిఎస్ రామయ్య భవన్‌లో మొగళ్ళ పల్లి పంచాయతీ ఆనంద్ కాలనీ గ్రామానికి చెందిన గ్రామస్తులు అధిక సంఖ్యలో సమావేశమై ఆనంద్ కాలనీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అగ్రలరీ శాఖ సమావేశంలో శాఖ అధ్యక్షులు శ్యామల వెంకటేశ్వర్లు నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ మచ్చ రామారావు మాట్లాడుతూ ప్రజల మధ్య అన్నివేళలా ఉంటూ పోరాటం చేయడం సీపీఐ(ఎం) పార్టీకే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికైన నూతన ప్రభుత్వం ముంపు ప్రాంతాలను గుర్తించి పంపు ప్రాంత ప్రజలకు ఇళ్ల స్థలాలు, అలాగే ఇల్లు కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని ఆయన అన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పేరుతో ముంపు గురైనటువంటి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్, మండల కమిటీ సభ్యులు శ్యామల వెంకట్, శాఖ సభ్యులు శ్యామల లక్ష్మయ్య, కారం ముత్తయ్య, కుర్సం రాంబాబు, సాయం ధనలక్ష్మి, సప్కా మంగవేణి, సోది సమ్మక్క, వాడ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రైలు ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి

- అత్యవసర పరిస్థితుల్లో 139కి ఫోన్ చేయాలి
- ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వి.గిరయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం



రైలు ప్రయాణికులు ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నెంబర్ 139కి ఫోన్ చేయాలని కొత్తగూడెం ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ వి.గిరయ్య తెలిపారు. సోమవారం భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ (కొత్తగూడెం) రైల్వే పోలీసులు ఆధ్వర్యంలో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వి.గిరియ్య మాట్లాడుతూ రైలు ప్రయాణికులు రైల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రయాణంలో బంగారు ఆభరణాల ధరించే మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అశ్రద్ధ చేసిన దొంగలు కాచుకుని ఉంటారని హెచ్చరించారు. ప్రయాణ సమయంలో కిటికీలకు దగ్గరగా కూర్చుని నిద్రించవద్దని సూచించారు. రాత్రి ప్రయాణంలో పడుకొనే సమయంలో సెల్ ఫోన్‌కు మొబైల్ చార్జర్ పెట్టి పడుకోవద్దని తెలిపారు. నడుస్తున్న రైలు బండి నుండి ఎక్కడం, దిగడం నేరమని చెప్పారు. రైలులో మండే పదార్థాలు, ఎల్ పీజీ గ్యాస్ తీసుకు వెళ్ళడం, బాణాసంచా తరలించడం నేరమని హెచ్చరించారు. వీటిని తరలించడం రైల్వే చట్టం ప్రకారం నేరమని అలాంటి వ్యక్తులపై రైల్వే చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రైల్వే స్థలాల్లో ప్రైవేట్ వ్యక్తులు వాహనాలు నిలపరాదని, రాంగ్ పార్కింగ్ చేయడం వలన పెనాల్టీ చెల్లించాల్సి వస్తుందని ప్రయాణికులకు సూచించారు. రైలు పట్టాలు దాటడం జరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మట్టి సాయి, ఏఎస్ఐ జీఎస్. స్వామి తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి అండగా మేమున్నాం

- కుమార్‌కు చేయూత ట్రస్ట్ సాయం

నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇదే గ్రామానికి చెందిన కంటే కుమార్‌కి రూ.10 వేల ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. ఇతని తండ్రి సాయిబ్ గత పది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో చనిపోవడంతో తల్లి నర్సమ్మ కూలీ పనిచేస్తూ కుమార్‌ను బాగా చదివించింది. చదువులో ఎప్పుడు ముందు వుండేవాడు, కానీ విధి చిన్న చూపు చూడటంతో తల్లి నర్సమ్మ కూడా గత ఏడాది క్రితం మృతిచెందింది. తన తల్లి నర్సమ్మ నే ప్రపంచంగా భావించే అతను ఆమె చనిపోవడంతో అప్పటినుండి తీవ్ర మనస్థాపంతోనే పాల్వంచలో తోటి అక్కలు దగ్గర ఉంటూ అప్పుడప్పుడు బంజర వస్తూ వెళ్ళే వాడు. డిప్రెషన్‌లో వున్నా కుమార్ గత పది రోజుల క్రితం తీవ్ర అనారోగ్యంతో వుండగా పలకరించిన బంధువులు, స్నేహితులు ఆరోగ్యం క్షీణించటం గమనించి ఖమ్మంలోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తీసుకు వెళ్లారు. గతం వారం రోజులుగా వైద్యం అందించినా ఫలితం లేకపోవడం వలన వైద్యులు ఇంటికి తీసుకు వెళ్ళమని చెప్పడంతో కనీసం హాస్పటల్ బిల్ కూడా కట్టలేని పరిస్థితిలో ఉన్న కుమార్‌కు సహాయం అందించేందుకు గాను తన స్నేహితుల సహాయంతో పాటు, ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సంద ర్భంగా చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మి నారాయణరెడ్డి మాట్లాడుతూ చేయూత ట్రస్టు ఏర్పాటుకు ముఖ్య కారణం నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలపడేందుకు విద్య, వైద్య అనే రెండు ప్రధాన రంగాలను ఎంచుకొని వారికి అండదండలు అందించి ముందుకెళ్తున్నామన్నా రు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దుర్గమ్మ ఆలయంలో మంత్రి పొంగులేటి దంపతుల పూజలు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

బెజవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాధురి దంపతులు దర్శించుకున్నారు. వీరి వెంట మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, శ్రీ లక్ష్మి దంపతులు కూడా ఉన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. తొలుత వైస్ ఆర్సీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు మంత్రి పొంగులేటికి ఘనస్వాగతం పలికారు. శాలువ, మెమొంటోను అందజేశారు. మంత్రి పొంగులేటిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.



కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలి

కుష్టు వ్యాధి నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రవీణ

నవతెలంగాణ-నేలకొండపల్లి

కుష్టు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కుష్టు వ్యాధి నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రవీణ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలను గుర్తింపు, నివారణ చర్యల గురించి ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని కుష్టు వ్యాధి నివారణ రికార్డులను, రిపోర్టులను ఆమె పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చర్మంపై పొడిబారిన, తెల్లమచ్చలు, మొద్దు బారిన మచ్చలపట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొద్దు బారిన మచ్చలను గుర్తించి ప్రాథమిక దశలోనే ఏండిటి చికిత్స ద్వారా రోగికి అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చున్నారు. ఈ చికిత్స వల్ల ఎటువంటి దుష్పరిణామాలు ఉండమన్నారు. ఈ చికిత్సలను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. కుష్టు వ్యాధి రోగుల పట్ల ఎటువంటి వివక్ష చూపకుండా ప్రేమగా చూడాలన్నారు. కుష్టు వ్యాధి నివారణ కొరకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కుష్టు వ్యాధి నివారణ ప్రోగ్రాం అధికారులు డిప్యూటీ పిఎంఒ సకలరెడ్డి, నరసింహారెడ్డి, లూర్తుమేరీ, డిప్యూటీ పిఎంఒ సంధ్య, స్థానిక పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ శంకర్ కుమార్, డాక్టర్ నిరోషా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కోటి 21 లక్షల విలువైన గంజాయి పట్టివేత

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఏఎస్పి పారితోష్ పంకజ్, ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు, సోమవారం ఫారెస్ట్ చెక్ పోస్ట్, భద్రాచలం వద్ద ఎస్సై విజయ లక్ష్మి పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా హర్యానాకు చెందిన మున్నిరం, బగత, గోవింద్ లు జల్సాల కోసం గంజాయి వ్యాపారం చేయాలని ఆలోచన వచ్చి, వీరు బల్వాన్ అనే వ్యక్తి ప్రోద్బలంతో ఒక ఆటోని కొనుగోలు చేశారు. దేవుని ప్రచార రథంల తయారు చేసి భక్తుల వేషం ధరించి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులలోని కలిమెల పరిసర ప్రాంతాలలో బుజ్జి అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి హర్యానాలో చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అవసరమైన వ్యక్తులకు అమ్మటకు అక్రమంగా తరలిస్తుండగా, ముగ్గురిని పట్టుకోవడం జరిగింది. పట్టుబడిన ముగ్గురు నిందితుల వద్ద నుండి 484 కిలోల గంజాయి ఒక ఆటో, రెండు సెల్ ఫోనులను స్వాధీనం చేసుకోవడం జరిగింది. వీటి విలువ కోటి 21 లక్షలు ఉంటుంది. భద్రాచలం టౌన్ సిఐ నాగరాజు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అదుపులోనికి తీసుకున్నట్లు చెప్పారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నవతెలంగాణ- కల్లూరు

వివాహ సమయంలో ఇచ్చిన కట్నం సరిపోక అదనపు కట్నం తేవాలంటూ కోడల్ని వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఎస్సై పి రఘు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని ముచ్చవరం గ్రామపంచాయతీ శివారు విశ్వనాథపురం గ్రామానికి చెందిన చింతపల్లి కృష్ణవేణికి 2021 లో ఆంధ్రప్రదేశ్ విజయవాడకు చెందిన చింతపల్లి కిరణ్ బాబుతో వివాహం జరిగింది. అప్పటినుంచి అదనపు కట్నం కావాలంటూ భర్తతో పాటు అత్త జయలక్ష్మి వేదింపులకు గురి చేస్తున్నారు. అత్తింటి వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చి తల్లిదండ్రులతో కలిసి వచ్చి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గౌరవ వందనం స్వీకరించిన డిప్యూటీ సీఎం

నవ తెలంగాణ- మధిర



డిప్యూటీ సిఎం పదవిని స్వీకరించి మొట్ట మొదటి సారిగా మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంకు వచ్చిన సందర్భంగా సోమవారం మల్లు భట్టి విక్రమార్కకి ప్రోటోకాల్లో భాగంగా పోలీస్ గార్డ్స్ ఇంచార్జ్ ఆధ్వర్యంలో గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో మధిర సిఐ వసంత కుమార్, పట్టణ ఎస్ఐ రాజేష్, రూరల్ ఎస్సై రఫీ మరియు గార్డ్స్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా
- అధికారులకు సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి
- నిర్లక్ష్యం వాయిస్తే చర్యలు తప్పవు
- ప్రజా దర్బార్‌కు హాజరుకాని అధికారులకు షోకాస్ నోటీస్ జారీకి ఆదేశం

నవతెలంగాణ-పాల్వంచ



పరిపాలనపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని పెండింగ్ పనులు పూర్తి చేయాలని అభ్యంతరాలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా చెప్పారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు ప్రజా దర్బార్ కార్యక్రమం పెండింగ్ ధ్రువీకరణ పత్రాలు తదితర అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులతోనూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు ఎంపీడీవోలో సమావేశం నిర్వహించారు కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని అన్నారు. తప్పనిసరి వేయాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని బయోమెట్రిక్ వేయకపోతే గైర్హాజరైగా పరిగణించి వేతనం నిలుపుదల చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతి సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా అధికారులు మాత్రమే హాజరు కావాలని, అధికారులు హాజరు కాలేని రోజుల్లో తదుపరి అధికారుల్ని పంపాలని ఆదేశించారు. సోమవారం ఎలాంటి సెలవులకు అనుమతి లేదని ప్రజాదర్బార్ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులకు షోకాస్ నోటీస్ జారీ చేయాలని కలెక్టరేట్ ఏవోకు సూచించారు అత్యవసర పరిస్థితుల్లో వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించాల్సి వస్తుందని అలాంటి సందర్భాల్లో తప్పక హాజరు కావాలని చెప్పారు. సెలవుల్లో ఉన్నప్పటికీ ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయాలని చెప్పారు. నియోజకవర్గాలకు, మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. సంబంధిత అధికారులు వారి వారి న్యాయవర్గం మండల పరిధిలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనే ప్రముఖుల పర్యటనలకు అన్ని ఏర్పాట్లు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రోటోకాల్స్ ఏర్పాట్లు పర్యవేక్షణలో ఎక్కడైనా లోటుపాటు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాల నుండి యువత నూతన ఓటరుగా నమోదు కావాలని చెప్పారు. ఆన్లైన్ ద్వారా నూతన ఓటరుగా నమోదుకు అవకాశం ఉన్నందున ఉపయోగించుకోవాలన్నారు. ఓటర్ నమోదు సవరణ తొలగింపు ప్రక్రియ ప్రారంభించారని చెప్పారు. జనవరి 6న ప్రకటన తదుపరి అభ్యంతరాలు స్వీకరించాలని చెప్పారు.

నేడే ఏకాదశి ముక్కోటి పై సమీక్ష సమావేశం

మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు భద్రాచలం ఆడియో కార్యాలయంలో నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి ముక్కోటి మహోత్సవాల సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ అన్ని శాఖల అధికారులను సమావేశానికి హాజరుకావాలని చెప్పారు. గతంలో నిర్వహించిన సమావేశంలో శాఖల వారి అధికారులు విధులు కేటాయించడం జరిగిందని సంబంధిత అధికారులు సమగ్ర నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రవీంద్రనాథ్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కార్తీక వన సమారాధన

నవతెలంగాణ- నేలకొండపల్లి

నేలకొండపల్లి భక్త రామదాసు సర్వీసెస్ ఆధ్వర్యంలో స్థానిక బౌద్ధ క్షేత్రంలో కుటుంబ సమేతంగా సోమవారం నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఆడుతూ పాడుతూ సందడి చేశారు. క్రీడా పోటీలు నిర్వహించి పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అక్కడివారిని అలరించాయి. కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేసి సమానత్వాన్ని చాటి చెప్పారు. అనంతరం సర్వీస్ సొసైటీ కోశాధికారి తెల్లగొర్ల లింగస్వామి అధ్యక్షతన జరిగిన సభలో సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కార్తీక మాసంలో కుల మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఐక్యం చేస్తూ వన సమారాధన పేరుతో ఒకే వేదిక వద్దకు వచ్చి సహపంతి భోజనాలు చేయడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. నేటి ఆధునిక సమాజంలో ఉరుకులు పరుగుల జీవితంలో ఏడాదికి ఒకరోజు ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సమేతంగా ఆనందంగా గడపడం కొత్త అనుభూతిని కలిగించిందన్నారు. కులమత రాజకీయాలకతీతంగా కుటుంబాల మధ్య సమన్వయంతోపాటు ఐక్యతను పెంచడానికి వన సమారాధన కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. తద్వారా రానున్న కాలంలో ప్రజలందరి సహకారంతో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సమాజంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తతం చేసేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎలమద్ది లెనిన్, సభ్యులు పచ్చ తిరుపతయ్య, గెల్ల జగన్మోహన్రావు, గణపతిరావు, పొనగాని శ్రీనివాస్, వెల్లంపల్లి శ్రీనివాసరావు, దుర్గారావు, కోదూరు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

ఏటీడీఓ అధికారిని వైఫల్యాలపై జిల్లా కలెక్టర్‌ను కలిసిన విద్యార్థి సంఘాలు

స్పందించిన కలెక్టర్.., కార్యాలయానికి పిలిపించి క్లాస్

నవతెలంగాణ-ఇల్లందు

గిరిజన వసతి గృహాల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అసమర్ధ సేవలు అందించే ఏటిడిఓపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పిడియస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నేతలు కాంపాటి పృథ్వీ, అభిమన్యు, ఎ.సాంబ డిమాండ్ చేశారు. ఏటిడిఓ అధికార వైఫల్యాలను జిల్లా కలెక్టర్‌కు వివరించేందుకు విద్యార్థి సంఘాల బృందం సోమవారం ప్రజా దర్బార్‌లో కలెక్టర్ ప్రియాంక అలాను కలిసి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రంలోని అంశాలను పరిశీలన చేసిన కలెక్టర్ ప్రజా దర్బార్‌లో ఉన్న ఐటిడిఏ అధికారులను పిలిచి తక్షణమే ఏటీడీవోను కలెక్టర్ కార్యాలయంకు రమ్మనాలని వారికి చెప్పి ఆదేశించారు. అనంతరం పిలిపించి క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది. ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిశీలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నేతలు మాట్లాడుతూ గిరిజన వసతి గృహాలలో చదివే విద్యార్థులకు ఎదురయ్యే అనేక ఆటంకాలను పరిష్కరించడంలో ఇల్లందు ఏటీడీఓ విఫలమవుతుందని ఏటీడీవోకు పరిపాలన అవగాహన లోపం వలనే అనేక సంఘటనలు పునరావృతం అవుతున్న పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. హాస్టల్లో జరిగే అనేక సంఘటనలకు విద్యార్థులతో తప్పుడు సాక్షాలను చెప్పిస్తూ అంతా మంచిగానే జరుగుతుందని అధికారులతో చెప్పి మమా అనిపిస్తూ కాలం గడుపుతున్నారని కానీ వాస్తవ విషయాలను మరుగున పెడుతూ బయటకు రానీయకుండా విద్యార్థి సంఘాలను, మీడియాను రావద్దంటూ గిరిజన ఆశ్రమాలలో వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే గత నాలుగు రోజుల క్రితం ఇల్లందు ఏజిహెచ్ఎస్ వసతి గృహంలో అదృశ్యమైన ఇద్దరు విద్యార్థినీలు జాయినింగ్ నాటి నుండి అదృశ్యం అయ్యేంతవరకు వసతి గృహంలో అడ్మిషన్ కాకుండానే ఉంటున్నారంటే ఏటీడీవో పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని వారు తెలిపారు. ఈ ఏటీడీవో అధికారంలోకి వచ్చిన నాటి నుండి వసతి గృహాలలో ఉపాధ్యాయులు, వార్డెన్ ల మధ్య ఘర్షణలు, ఉపాధ్యాయుల మధ్య లంబాడా, కోయ అనే తీవ్రమైన వైరుధ్యాలు, విద్యార్థుల అదృశ్యాలు, భోజన నాణ్యత లోపించడం, విద్యార్థులపై ఉపాధ్యాయుల దాడి, హాస్టల్ వార్డెన్ లపై ప్రయివేటు



వ్యక్తులను తానే పంపించి గొడవలు చేయించడం లాంటి అనేక సంఘటనలు గిరిజన వసతి గృహాలలో జరుగుతున్నాయని గత మూడు సంవత్సరాలుగా అధికారులకు చెబుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం బాధాకరమని వారు తెలిపారు. ఇప్పటికైనా ఈ అసమర్ధ ఏటిడిఓను బదిలీ చేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పిడియస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు గణేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ భద్రాచలం రూరల్

మూడు గ్రామ పంచాయతీల్లో ఎన్నికల జీవో నెంబర్ 45ను అమలు చేయాలని కోరుతూ అలాగే దుమ్ముగూడెం మండలం తునికి చెరువు రూట్ నుండి ఆర్లగూడెం మారాయిగూడెం చెరువుపల్లి రూట్ లో బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఐటీడీఏ ముందు గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రంలో అన్ని మండలాలలో 500 జనాభా గల గ్రామాలను పరిపాలన సౌభల్యం కోసం గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసి పరిపాలన కొనసాగిస్తున్నారు. భద్రాచలంలో గత 30 సంవత్సరాల నుండి ఎన్నికలు నిర్వహించకుండా పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తూ వచ్చాయి. జీఎస్‌పి ఆధ్వర్యంలో రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ వేయడం మూలంగా 2022 డిసెంబర్ 16న రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వం భద్రాచలం గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని జీవో నెంబర్ 45ను విడుదల చేసిందని అన్నారు. జిల్లా అధికారుల నిర్లక్ష్యం మూలంగానే భద్రాచలం మూడు గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదని విమర్శించారు. ఈ దీక్షలకు పొలిటికల్ ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర, ఆదివాసీ లాయర్ల ఫోరం వైస్ ప్రెసిడెంట్ సున్నం రమేష్, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తవరపు జానకిరామ్, తుడుం దెబ్బ సీనియర్ నాయకులు యాశం రాజు, మన్య సీమ గిరిజన సంఘం సీనియర్ నాయకులు చిచ్చడి శ్రీరామ్ మూర్తి, కొర్శచిట్టి బాబు దొర, కుంజా దుర్గ, కల్లూరి రాజమ్మ, పాయం సన్యాసి, సున్నం సుబ్బయ్య, పాయం కామేష్,



ఇర్పమల్లూరు బుర్ర రాజు, కురుసంభద్రయ్య, కురుశం లక్ష్మయ్య, జంపన్న, విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ ఇర్పాప్రకాష్ మద్దతు తెలిపి పాల్గొన్నారు.



మొక్కుతీర్చుకున్న కాంగ్రెస్ నాయకులు

నవ తెలంగాణ- తల్లాడ

సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ మట్టా రాగమయి గెలిస్తే 108 కొబ్బరికాయలతో మొక్కు తీర్చుకుంటామని తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు మొక్కుకున్నారు. ఆమె గెలవడంతో సోమవారం ఏన్కూరు మండలం గార్ల ఒడ్డు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తాటి నరసింహారావు, షేక్ జమాల్ పాల్గొన్నారు.



ఎస్‌బీఐటీలో విదేశీ ఉన్నత విద్యపై అవగాహన సదస్సు

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మంలోని ఎస్బిఐటిలో ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం తెలంగాణా ఓవర్సీస్ కంపెనీ ఆధ్వర్యంలో విదేశాలలో ఉన్నత విద్యపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంపెనీ ప్రతినిదులు కార్తీక్, స్వప్నలు హాజరై విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే సమయంలో ఉపకార వేతనాలు ఎలా పొందాలి, ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి, అధ్యాపకులు బోధించే విధానంను ఎలా అర్థం చేసుకోవాలి, విదేశాల్లో ఇతరులతో ఎలా ప్రవర్తించాలి తదితర అంశాలపై వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహనా సదస్సు నిర్వహించారు. అదే విధంగా విదేశాలలోని కంపెనీలపై, ఉద్యోగాలపై, వాటిని సాధించేందుకు ఎటువంటి పద్ధతులు అవలంభించాలి లాంటి అంశాలపై కూడా వివరించారు. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానికి అనుగుణంగా ముందుకు సాగితే దేనినైనా సాధించవచ్చు అని అన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు పేదరికం అడ్డు కానే కాదని అన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే దానిని కూడా అధిగమించి లక్ష్యాన్ని సాధించవచ్చు అని తెలిపారు. ఎటువంటి మోసాలకు గురికాకుండా ఉండేందుకు విదేశాల్లోని యూనివర్సిటీలపై, కంపెనీలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు. దీనికి సాంకేతికతను కూడా జోడిస్తే మరింత సమాచారం పొందవచ్చని తెలిపారు. అదే విధంగా అక్కడ విద్యను పూర్తి చేసిన, ఉద్యోగం చేస్తున్న వారి సలహాలు, సూచనలు కూడా తీసుకోవాలని అన్నారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి మాట్లాడుతూ విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్యపై, స్థానిక ఉద్యోగాలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల జీవితంలో స్థిరపడేందుకు వారిని సంసిద్ధులుగా తయారు చేసేందుకు పలు రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే ఇటువంటి కార్యక్రమాలను యాజమాన్యం నిర్వహిస్తుందని వివరించారు. కార్యక్ర మంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బిందాజ్, ఎకడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, డా. వివి శివ ప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ జె.రవీంద్ర బాబు, డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, టిపిఒఎన్. సవిత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరం పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

నవతెలంగాణ- ఖమ్మం



గ్రీవెన్స్ డే'లో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర పరిష్కార చర్యలు చూపాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించి తగు చర్య నిమిత్తం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వైరా మండలం జింకలగూడెం, తాటిపుడి గ్రామంకు చెందిన ఎస్.కె. లాల్‌బీ తన సదరన్ సర్టిఫికేట్‌లో ఫోటో, ప్రభుత్వ అధికారుల సంతకాలు ప్రింటు కాలేదని సరిచేయించగలరని, తనకు ట్రైసైకిల్ ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. నేలకొండపల్లి బిసి, ఎస్సి కాలనీకి చెందిన కొప్పుల వెంకటరామిరెడ్డి తన కుమార్తె కొప్పుల రమాదేవికి మార్చి, 2023లో వివాహం అయినందున రేషన్ కార్డులో తన కూతురు పేరును తొలగించగలరని కోరగా, కుమార్తెకు బదులుగా తన భార్య కొప్పుల జానకీ పేరును తొలగించారని అ తప్పిదంను సరిచేయ గలరని సమర్పించిన దరఖాస్తును, కల్లూరుకు చెందిన టి.శిరీష రేషన్ నియామక పరీక్షలో తనకు అన్యాయం జరిగిందని, తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థిని ఎంపిక చేయడం జరిగిందని, తనకు న్యాయం చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా పౌరసరఫరాల అధికారిని ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం పడమటి తండాకు చెందిన బి. పద్మకుమారి తన కుమార్తె భూక్యా శ్రీలేఖకు మే, 2023న వివాహం జరిగినదని, కళ్యాణలక్ష్మీ మంజూరు చేయించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం తిరుమలా యపాలెం తహశీల్దారును ఆదేశించారు. ఖమ్మం నగరం రమణగుట్టకు చెందిన జి. నాగేంద్ర తనకు గల రెండు గదుల ఇంటికి రూ. 322 లు ఇంటిపన్ను చెల్లించడం జరిగేదని, నగరపాలక సంస్థ వారు మరల రూ. 32,299లు ట్యాక్స్ కట్టాలని తెలిపారని, విచారణ చేసి అ ఇంటి పన్ను తగ్గించగలరని సమర్పించిన దరఖాస్తును నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరం రిక్కాబజార్‌కు చెందిన దుగ్గిరాల వెంకన్న తన మనవరాలు ఉష్శ్రీ కి తండ్రి లేడని, ఎలాంటి ఆధారం లేదని తనకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఖమ్మం అర్బన్ తహశీల్దారును కలెక్టర్ ఆదేశించారు. సత్తుపల్లికి చెందిన పఠాన్ పాషా తన కాళ్ళు చేతులు పడిపోయినానని ఏ జీవనాధారం లేదని తనకు పెన్షన్ మంజూరు కావడం జరిగిందని కాని పెన్షన్ జమ కావడం లేదని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం తహశీల్దారును కలెక్టర్ ఆదేశించారు. తన ఆరోగ్యం బాగు లేనందున చికిత్స చేయించాలని కోరగా, వెంటనే స్పందించిన కలెక్టర్, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, డిసిహెచ్ఎస్ లను చర్యలకై ఆదేశించగా, అంబులెన్స్ రప్పించి, ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కు తరలించడం జరిగింది. పిడిఎస్‌యు ప్రతినిధి బృందం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీఇంబర్స్‌మెంట్ విడుదల చేయించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. తల్లాడ మండలం మల్లవరం గ్రామంకు చెందిన దుగ్గిదేవర సామ్రాజ్యం మల్లవరం సర్వేనెం. 525/అ లో 8 ఎకరాల భూమికి ఎన్ఓసి ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును, పెనుబల్లి మండలం చింతగూడెంకు చెందిన కొమ్మురమేష్ చింతగూడెం సర్వేనెం. 71/5 0.20 కుంటల భూమికి 1984లో పట్టా ఇవ్వడం జరిగినదని, ప్రభుత్వం స్వాధీనపర్చుకోవడం జరిగిందని, తిరిగి తనకు ఇప్పించగలరని సమర్పించిన దరఖాస్తును తగు చర్య నిమిత్తం ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారికి సూచించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ పెండింగ్ గ్రీవెన్స్ దరఖాస్తులపై సమీక్షించారు. ఇప్పటివరకు 1262 దరఖాస్తులు రాగా, 953 దరఖాస్తులు పరిష్కరించినట్లు, 219 దరఖాస్తులు పెండింగ్ లో ఉండగా, 90 దరఖాస్తులు పరిష్కారానికి ఇతర సంబంధిత శాఖలకు ఫార్వార్డ్ చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఫార్వార్డ్ చేసిన దరఖాస్తుల పరిస్థితిని పర్యవేక్షించాలని ఆయన అన్నారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి జి. గణేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.